www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 82 | మంగళవారం | 3 నవంబర్, 2026

మళ్లీ మెరిసిన బంగారం

- దీపావళి కొనుగోళ్లతో జోరందుకున్న పసిడి అమ్మకాలు
- 10 గ్రాములపై రూ.500 పెరిగిన ధర.. స్థిరంగా వెండి ధరలు

7



మంచు తెరలు.. కాలుష్య సెగలు!

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. కాలుష్య కారకాలు పెరిగిపోవడంతో నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. దీంతో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన అక్షరధామ్ ఆలయం సైతం పొగమంచు తెరల వెనుక మసకబారిపోయింది. సోమవారం న్యూఢిల్లీలో కనిపించిన ఈ దృశ్యం రాజధానిలో పెరుగుతున్న వాయు కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది.

– న్యూఢిల్లీ



సంక్షోభంలోనూ ఆర్థిక వృద్ధి

పదేళ్లలో మరో 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం

- 2030 నాటికి 500 గిగావాట్ల స్వచ్ఛ ఇంధన లక్ష్యాన్ని చేరుకుంటాం
- భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పోలో ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు అంతరాయం కలిగిస్తున్నప్పటికీ భారత్ మాత్రం అధిక ఆర్థిక వృద్ధిని కొనసాగిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. రానున్న 10 నుంచి 11 ఏళ్లలో దేశంలో అదనంగా దాదాపు 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం కఠినమైన సవాలేనని, అయినప్పటికీ దాన్ని సాధించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో సోమవారం జరిగిన 'భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో–2026' ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో శిలాజ ఇంధనేతర విద్యుత్ ఉత్పత్తి స్థాపిత సామర్థ్యం 300 గిగావాట్లను దాటిందని తెలిపారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధిస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వచ్చే పదేళ్ల నుంచి పదకొండేళ్లలో మరో 500 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

ముందుగానే పెట్టుబడులు

గత పదేళ్లలో భారత్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోకపోయి ఉంటే, దేశంలో ఇంధన సంక్షోభం ప్రపంచంలోని ఇతర ప్రాంతాల కంటే మరింత తీవ్రంగా ఉండేదని మోడీ అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ ఇంధన రంగంలో ముందుగానే పెట్టుబడులు పెట్టి సామర్థ్యాన్ని పెంచుకోవడం వల్ల ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభ పరిస్థితుల్లోనూ భారత్ తన ఆర్థిక వృద్ధిని కొనసాగించగలుగుతోందని వివరించారు. ఈ ఏడాది ప్రారంభంలో పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు ఆటంకాలు ఏర్పడి అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. భారత్‌లో రాజకీయ, విధానపరమైన స్థిరత్వం ఉందని, పునరుత్పాదక ఇంధన రంగంలో అపారమైన పెట్టుబడి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మోడీ తెలిపారు. దేశంలో పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. ఈ దశాబ్దం ముగిసే నాటికి పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి అవకాశాలు ఏర్పడనున్నాయని వెల్లడించారు. సౌర, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారత్ ప్రపంచంలోని అగ్రస్థానంలో ఉన్న మూడు దేశాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.



సౌర విద్యుత్‌తో అనుసంధానించాలి

ప్రతి ప్రభుత్వ భవనం, పాఠశాల, కళాశాల, ఆసుపత్రి, వీధి దీపాల వ్యవస్థను సౌర విద్యుత్‌తో అనుసంధానించాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. దేశీయంగా విద్యుత్ నిల్వ పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో, అదనంగా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను తరువాయి 2లో..

బోగస్ ఓట్ల తొలగింపును వ్యతిరేకిస్తారా?

- తెలంగాణను ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మార్చారు
- 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో ప్రజాధనాన్ని వసూలు చేస్తున్నారు
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా బీజేపీ మహా పాదయాత్ర

2



ఖేలో ఇండియా నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- డిసెంబరు 11 నుంచి 22 వరకు పోటీలు
- 20 వేదికల్లో 27 క్రీడాంశాలు.. 7 వేల మందికి పైగా క్రీడాకారులు
- నాణ్యతలో రాజీ వద్దు.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

2



మెట్రో ఫేజ్–2కు రూ.150 కోట్లు విడుదల

రూ.600 కోట్ల బడ్జెట్ కేటాయింపులో తొలి విడత నిధులు మంజూరు

2

సంక్షోభంలోనూ ఆర్థిక వృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు మౌలిక సదుపాయాలను కూడా విస్తరించా ల్సి ఉందని చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ రంగంలోనూ భారత్ వేగంగా ముందుకు సాగుతోందని మోడీ తెలిపారు. జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ ద్వారా ఈ రంగంలో పురోగతి సాధిస్తున్నామని, ఏటా 50 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇంధన భద్రతకు స్వచ్ఛమైన విద్యుత్తే కీలకమని స్పష్టం చేశారు.

గ్రీన్ ఎనర్జీ కారిడార్ కీలకపాత్ర

పునరుత్పాదక ఇంధన కేంద్రాల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార మార్గాలతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్' కీలక పాత్ర పోషించనుందని ప్రధాని వివరించారు. ఈ కారిడార్ రెండో దశ కోసం ప్రభుత్వం రూ.2 లక్షల కోట్ల కేటాయింపులు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 44 వేలకు పైగా ప్రభుత్వ భవనాలను సౌర విద్యుత్‌తో అనుసంధానించామని, తద్వారా ఏటా సుమారు రూ.700 కోట్ల మేర విద్యుత్ ఖర్చు ఆదా అవుతోందని మోడీ వెల్లడించారు.



పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరం చేయాలి

ప్రజానావ, సికింద్రాబాద్: పట్టభద్రుల ఓటర్ల నమోదు పట్ల నిర్లిప్తత తగదని, ఈ ప్రక్రియలో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి అర్హులు పేర్లు నమోదు చేసుకొనేలా కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. పార్సిగుట్ట రాఘవ గార్డెన్ వద్ద జరిగిన ఓటర్ల నమోదును సోమవారం పద్మారావు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ లోని 8 మునిసిపల్ వార్డుల్లో పట్ట భద్రుల ఓటర్ల నమోదును ముమ్మరం చేశామని తెలిపారు. అర్హులైన అందరు పట్టభద్రుల పేర్లను నమోదు చేయించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్. యువ నేతలు కిశోర్ కుమార్, రామేశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, నాయకులు పాల్గొన్నారు.

పైవేటు పెట్టుబడులకు క్యాపెక్స్ కొనసాగింపు

- ఆర్థిక క్రమశిక్షణతో వృద్ధికి ప్రోత్సాహం
- ఏడు శాతానికి పైగా వృద్ధి నమోదు
- యువతకు ఏఐ నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ

ముంబై: దేశంలో ప్రైవేటు పెట్టుబడులు గణనీయంగా పెరిగి, కొత్త ఉత్పత్తి సామర్థ్యాల ఏర్పాటుకు పరిశ్రమలు ముందుకొచ్చే వరకు ప్రభుత్వం మూలధన వ్యయాన్ని (క్యాపెక్స్) కొనసాగిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఆర్థిక క్రమశిక్షణకు విఘాతం కలగకుండా, వృద్ధికి దోహదపడే రంగాల్లో ప్రభుత్వ వ్యయాన్ని కొనసాగిస్తామని తెలిపారు. గత నాలుగైదేళ్లుగా మూలధన వ్యయానికి ప్రాధాన్యమివ్వడం వల్ల ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. సోమవారం ముంబయిలో హెచ్ఎన్‌బీసీ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దేశ ఆర్థిక వృద్ధి వ్యూహంలో మూలధన వ్యయం కీలక పాత్ర పోషిస్తోందని నిర్మలా సీతారామన్ వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఈ విధానాన్ని అనుసరిస్తోందన్నారు. ప్రైవేటు రంగం పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్యాల విస్తరణలో వేగం పుంజుకునే వరకు ప్రభుత్వ వ్యయానికి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. దేశ వృద్ధి వేగం తగ్గకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తామని చెప్పారు.

పటిష్ఠంగా ఆర్థిక వ్యవస్థ

భారత్ ఆర్థిక వ్యవస్థ ఏడు శాతానికి పైగా వృద్ధిని నమోదు చేస్తోందని, క్షేత్రస్థాయిలో ఆర్థిక కార్యకలాపాలు ఆశాజనకంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. జీఎస్టీ వసూళ్లు, బ్యాంకుల పనితీరు వంటి కీలక సూచీలు సానుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో బలహీనత ఏమీ లేదని, భారత్ వృద్ధి సామర్థ్యంపై ప్రతి ఒక్కరూ విశ్వాసంతో ఉండాలని సూచించారు. అనవసరమైన సందేహాలు, ప్రతికూల వ్యాఖ్యలకు బదులుగా ఆశావహ దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. అంతర్జాతీయంగా పలు సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఇంధన అవసరాలకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హార్ముజ్ జలసంధి దిగ్బంధం వంటి పరిణామాలు ప్రపంచ ఇంధన రంగంపై ప్రభావం చూపుతున్నా, భారత్‌కు ఇంధన సరఫరా సకాలంలో జరుగుతోందని వివరించారు.

ఏఐ నైపుణ్యాలు తప్పనిసరి

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాలను అందించడం అత్యంత అవసరమని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. జిల్లా స్థాయిలోనే ఏఐ, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, హార్డ్‌వేర్ రంగాల్లో శిక్షణ ఇచ్చే ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ పట్టభద్రుల నైపుణ్యాలు సైతం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉండటం లేదని, పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు) కూడా ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని అభిప్రాయపడ్డారు. రెండేళ్ల క్రితం బడ్జెట్‌లో ప్రకటించిన ఐటీఐల ఆధునికీకరణ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేస్తున్న రాష్ట్రాలు ప్రయోజనం పొందుతున్నాయని తెలిపారు. అసోం, ఒడిశా ప్రభుత్వాలు సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుని, అక్కడి ప్రభుత్వ ధ్రువీకరణతో కూడిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక శిక్షణ బ్యాచ్ ఇప్పటికే సింగపూర్‌కు వెళ్లిందని వివరించారు.



టాటా వివాదం త్వరగా సమసిపోవాలి

- టాటా సన్స్–టాటా ట్రస్ట్స్ మధ్య విభేదాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి
- భారత ఆర్థిక వ్యవస్థకు టాటా గ్రూప్ కీలకం
- వివాదం బహిరంగ చర్చకు దారితీయడం సరికాదు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

టాటా సన్స్, దాని అతిపెద్ద వాటాదారు టాటా ట్రస్ట్స్ మధ్య కొనసాగుతున్న విభేదాలను వీలైనంత త్వరగా సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. భారత ఆర్థిక వ్యవస్థకు టాటా గ్రూప్ అత్యంత కీలకమైనదని, సంస్థలోని విభేదాలు బహిరంగ చర్చకు దారితీయడం తగదని అన్నారు. ఇరుపక్షాలు చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ లీడర్‌షిప్ అవార్డ్స్–2026 కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. టాటా గ్రూప్‌లో నెలకొన్న పరిస్థితి సున్నితమైన అంశమని, దీనిని పరిష్కరించేందుకు వ్యాపారపరమైన అవగాహనతోపాటు భాగస్వాముల మధ్య సుహృద్భావం అవసరమని సీతారామన్ పేర్కొన్నారు. సంస్థ నాయకత్వం పరిపక్వతతో వ్యవహరించి విభేదాలను త్వరగా పరిష్కరించి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇరువర్గాలతో చర్చలు జరుపుతుందా? అన్న ప్రశ్నకు స్పందించేందుకు నిరాకరించారు. 158 ఏళ్ల చరిత్ర కలిగిన టాటా గ్రూప్‌లో కొన్ని నెలలుగా విభేదాలు కొనసాగుతున్నాయి. సెప్టెంబరు 17న టాటా సన్స్ బోర్డు సమావేశంలో చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ వర్గానికి, టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయల్ టాటా వర్గానికి మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. టాటా సన్స్‌ను కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీగా నమోదు నుంచి తొలగించాలన్న అభ్యర్థనను ఆర్బీఐ తిరస్కరించిన నేపథ్యంలో, నిబంధనల ప్రకారం కంపెనీని స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని బోర్డు నిర్ణయించింది. చంద్రశేఖరన్‌ను మరోసారి చైర్మన్‌గా నియమించింది. ఈ నిర్ణయానికి నోయల్ టాటా ఒక్కరే వ్యతిరేకంగా ఓటు వేశారు.

పెట్టుబడులపై ఆందోళన తెలుసు

విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ఈక్విటీ పెట్టుబడులకు మద్దతు అవసరంపై కూడా ఆర్థిక మంత్రి స్పందించారు. రిటైల్ పెట్టుబడిదారులు, మార్కెట్ వర్గాల్లో ఆందోళనను ప్రభుత్వం గుర్తించిందన్నారు. 2023–24లో విదేశీ పెట్టుబడులు అత్యధికంగా వచ్చినప్పటి పన్నుల విధానమే ఇప్పుడూ ఉన్నప్పటికీ, పరిస్థితులు మారాయని వివరించారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) నికర పెట్టుబడుల ఉపసంహరణ పెరిగిందని, తిరిగి పెట్టుబడుల రాక మొదలైనా ఆందోళనలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశ ఆర్థిక వృద్ధిని కొనసాగించేందుకు మూలధనం, ముఖ్యంగా ఈక్విటీ పెట్టుబడులు ఎంతో అవసరమని సీతారామన్ అన్నారు. వరుసగా ఏడు శాతానికి పైగా వృద్ధిని కొనసాగిస్తున్న భారత్ ఆర్థిక ప్రగతికి పెట్టుబడులు కీలకమని, మార్కెట్ వర్గాలు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు.

బోగస్ ఓట్ల తొలగింపును వ్యతిరేకిస్తారా?

- తెలంగాణను ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మార్చారు
- 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో ప్రజాధనాన్ని వసూలు చేస్తున్నారు
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా బీజేపీ మహా పాదయాత్ర

ప్రజానావ, హైదరాబాద్: బోగస్ ఓట్ల తొలగింపు కోసం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'ఓట్ బచావో' ర్యాలీ నిజానికి చొరబాటుదారులను కాపాడే కార్యక్రమమని విమర్శించారు. రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా అక్రమ చొరబాటుదారులకు ఓటర్ల జాబితాలో చోటు ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణను ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మార్చి, 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో ప్రజాధనాన్ని వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా బీజేపీ సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని అంతం చేద్దాం' మహా పాదయాత్రలో అమిత్‌షా పాల్గొన్నారు. ఎల్బీ స్టేడియం సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ప్రారంభమైన యాత్ర మొజాంజాహీ మార్కెట్ వరకు సాగింది. అనంతరం అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.



13 కోట్ల ఓట్ల తొలగింపుపై వివరణ

ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రచారాన్ని అమిత్‌షా ఖండించారు. తొలగించిన వాటిలో 6.5 కోట్లు ఇతర ప్రాంతాలకు వెళ్లినవారివి, మూడు కోట్లు మరణించినవారివి, కోటి డూప్లికేట్ నమోదులని పేర్కొన్నారు. మిగిలిన మూడు కోట్లు ఉనికిలో లేని చొరబాటుదారులకు సంబంధించినవని ఆరోపించారు. దేశ పౌరులకే ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్, ఈవీఎంల అంశాలపై పార్లమెంటులో చర్చకు బీజేపీ సిద్ధమని, కాంగ్రెస్ ముందుకు రావాలన్నారు.

కాంగ్రెస్ అవినీతిపై విమర్శలు

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అమిత్‌షా విమర్శించారు. యూపీఏ పదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని అడ్డుకునే శక్తి బీఆర్ఎస్, ఎంఐఎంలకు లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పార్టీ శ్రేణులకు సూచించారు. ఎస్ఐఆర్‌పై ప్రజలకు వాస్తవాలు వివరించాలని కోరారు. అంతకుముందు అమిత్‌షా చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, కొమురం భీమ్, రాంజీ గోండ్‌లకు నివాళులర్పించారు. సభలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితర బీజేపీ నేతలు పాల్గొన్నారు.



ఖేలో ఇండియా నిర్వహణకు

పకడ్బందీ ఏర్పాట్లు

- డిసెంబరు 11 నుంచి 22 వరకు పోటీలు
- 20 వేదికల్లో 27 క్రీడాంశాలు.. 7 వేల మందికి పైగా క్రీడాకారులు
- నాణ్యతలో రాజీ వద్దు.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో డిసెంబరు 11 నుంచి 22 వరకు జరగనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. క్రీడా వేదికల అభివృద్ధిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పోటీలు ముగిసిన తర్వాత కూడా అవి శాశ్వత క్రీడా వనరులుగా ఉపయోగపడేలా చూడాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు మరో ఐదు నగరాల్లోని 20 వేదికలపై 27 రకాల క్రీడా పోటీలు, ఒక ప్రదర్శన క్రీడ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా 7 వేల మందికి పైగా క్రీడాకారులు, సుమారు 2 వేల మంది కోచ్‌లు, అధికారులు పాల్గొననున్నారు. ఆతిథ్య రాష్ట్రం కోటాలో తెలంగాణ సంప్రదాయ క్రీడ కర్రసామును కూడా చేర్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు గ్రూప్–1 స్థాయి అధికారులను నియమించాలని, క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి వారం పురోగతిపై నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. తెలంగాణను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే లక్ష్యంతో ఈ పోటీలను ఉపయోగించుకోవాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు, శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రారంభ, ముగింపు వేడుకల్లో అనవసర ఆడంబరాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హరిత టపాసులకే అనుమతి!

- ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో దీపావళి టపాసులు కాల్చుకునేందుకు సుప్రీం ఓకే
- 7, 8 తేదీల్లో నిర్ణీత సమయాల్లోనే కాల్చాలని స్పష్టం
- 9వ తేదీ నుంచి మళ్లీ పూర్తి నిషేధం

న్యూఢిల్లీ: ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో దీపావళి సందర్భంగా హరిత టపాసులు కాల్చుకునేందుకు సుప్రీం కోర్టు తాత్కాలిక అనుమతి ఇచ్చింది. నవంబరు 7, 8 తేదీల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే వీటిని కాల్చాలని స్పష్టం చేసింది. నవంబరు 9 నుంచి తిరిగి పూర్తి నిషేధం అమల్లోకి వస్తుందని తెలిపింది. కాలుష్య నియంత్రణకు పూర్తి నిషేధమే పరిష్కారమని చెప్పేందుకు తగిన సమాచారం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. 2024లో విధించిన నిషేధంతో గాలి నాణ్యతలో ఆశించిన మార్పు కనిపించలేదని పేర్కొంది. ఆసు పత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాల చుట్టూ 300 మీటర్ల పరిధిని 'టపాసుల నిషేధిత ప్రాంతం'గా ప్రకటించాలని ఆదేశించింది. సీఎస్ఐఆర్–నీరితో అభివృద్ధి చేసిన హరిత టపాసులు సాధారణ బాణసంచాతో పోలిస్తే 30 శాతం తక్కువ కాలుష్యాన్ని విడుదల చేస్తాయని తెలిపింది. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలని, అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఢిల్లీ సరిహద్దుల్లో తనిఖీలు పెంచాలని సూచించింది. కాలుష్య నియంత్రణకు ప్రజల్లోనూ అవగాహన పెరగాలని ధర్మాసనం పేర్కొంది. విరాట్ కోహ్లీ వంటి క్రీడాకారులు, సినీ ప్రముఖులు అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు బోధించాలని సూచించింది.



ముంచుకొస్తున్న మురసు

- నేటి అర్ధరాత్రి నెల్లూరు–నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 110 కి.మీ. వేగంతో గాలులు..
- 19 విమానాలు రద్దు
- ఒడిశాలో లక్షన్నర మందికి పైగా తరలింపు

న్యూఢిల్లీ: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను 'మురసు' ఆంధ్రప్రదేశ్ తీరంవైపు దూసుకొస్తోంది. మంగళవారం అర్ధరాత్రి లేదా బుధవారం తెల్లవారుజామున నెల్లూరు–నర్సాపురం మధ్య, ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 100–110 కిలోమీటర్ల వేగంతో గాలులు, అప్పుడప్పుడు 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచవచ్చని హెచ్చరించింది. దక్షిణ కోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, లోతట్టు ప్రాంతాల్లో ముంపు ప్రమాదం ఉందని తెలిపింది. తుపాను ప్రభావంతో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాల్లో సోమవారం 19 దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. చెన్నైలోనూ కొన్ని సర్వీసులను నిలిపివేశారు. ఉత్తర తమిళనాడులో కురుస్తున్న భారీ వర్షాలతో చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముందుజాగ్రత్తగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఇప్పటివరకు 1,51,434 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 1,139 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. కోరాపుట్‌లోనూ 500 మందిని తరలించారు. దక్షిణ ఒడిశాలో భారీ వర్షాల నేపథ్యంలో పది మధ్యతరహా జలాశయాల నుంచి నీటిని ముందుగానే విడుదల చేస్తున్నారు. రాయగడ, కోరాపుట్, మల్కాన్‌గిరి, గజపతి, గంజాం జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు.



ఏపీకి కర్ణాటక అండ

తుపాను సహాయక చర్యల్లో ఆంధ్రప్రదేశ్‌కు కర్ణాటక ప్రభుత్వం సహకారం ప్రకటించింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం అవసరమైన పరికరాలతో పాటు 500 మంది నైపుణ్యం కలిగిన సిబ్బందిని పంపిస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మరోవైపు, సముద్రం నవంబరు 4 వరకు అల్లకల్లోలంగా ఉంటుందని ఐఎండీ హెచ్చరించింది.

మెట్రో ఫేజ్–2కు రూ.150 కోట్లు విడుదల

- రూ.600 కోట్ల బడ్జెట్ కేటాయింపులో తొలి విడత నిధులు మంజూరు
- జీవో 991 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సోమవారం జీవో నంబర్ 991 జారీ చేసింది. 2026–27 బడ్జెట్‌లో ఫేజ్–2 కోసం కేటాయించిన రూ.600 కోట్లలో తొలి విడతగా ఈ మొత్తాన్ని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్)కు విడుదల చేసేందుకు పరిపాలనా అనుమతి ఇచ్చింది. దీంతో ఈ పద్దు కింద మరో రూ.450 కోట్లు అందుబాటులో ఉంటాయి. హెచ్ఏఎంఎల్ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, ఆర్థిక శాఖ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది. మంజూరైన నిధులను మెట్రో రెండో దశ పనుల వ్యయాలకు వినియోగించనున్నారు. ఖర్చుల వివరాలు, వినియోగ ధ్రువీకరణ పత్రాలను ప్రతి నెలా ప్రభుత్వానికి, అకౌంటెంట్ జనరల్‌కు సమర్పించాలని హెచ్ఏఎంఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించింది. నిధుల వినియోగంలో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని స్పష్టం చేసింది.

తెలంగాణకు జలగండం!



వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు ప్రకృతికే కాదు.. మనిషి మనుగడకూ సవాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్న ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకునే మార్పులకు సంబంధించిన ఈ వాతావరణ దృగ్విషయం.. భారత రుతు పవనాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఫలితం గా వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, కరవు పరిస్థితులు ఏర్పడటం వంటి పరిణామాలు ఎదురవుతాయి. తెలంగాణలో ఇప్పటికే కనిపిస్తున్న వర్షాభావ పరిస్థితులు ఈ ఆందోళనలను మరింత పెంచుతున్నాయి. ఇది కేవలం ఒక వ్యవసాయ సీజన్‌కు సంబంధించిన సమస్య కాదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, గ్రామీణ జీవన విధానం, తాగునీటి భద్రత, పశుసంపదతో ముడిపడిన సంక్షోభం.

ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబర్ 31 వరకు రాష్ట్రంలో సాధార ణంగా 830.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండ గా.. 628.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే 24 శాతం లోటు. అక్టోబర్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. సాధా రణంగా 90.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. కేవలం 12.7 మిల్లీమీటర్లే నమోదైంది. ఈ గణాంకాలు రాష్ట్రం ఎదుర్కొం టున్న వర్షాభావ తీవ్రతకు అద్దం పడుతున్నాయి. మరోవైపు నవంబరులోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అంటే ఇప్పటికిప్పుడు కురిసే అకాల వర్షాలు కొంత ఉపశమనం కలిగించినా.. ఇప్పటికే ఏర్పడిన లోటును పూడ్చడం అంత సులభం కాదు.

అన్నదాతకు అగ్నిపరీక్ష

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక. అలాంటి వ్యవసాయ రంగాన్ని ఎల్‌నినో ప్రభావం కుదిపేస్తోంది. వర్షాలు సకాలంలో కురవకపోవడం, సాగు విస్తీర్ణం తగ్గడం, వేసిన పంటలకు తగినంత నీరు అందకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటల సాగుపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇప్పటికే ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పంట పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులు దిగుబడులు తగ్గితే వాటిని ఎలా తీర్చాలో తెలియని అయోమయంలో పడే ప్రమాదం ఉంది. పంట నష్టంతో మొదలయ్యే సమస్య.. రైతు కుటుంబాల ఆదాయం, గ్రామీణ కొనుగోలు శక్తి, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలపైనా ప్రభావం చూపుతుంది.

నీటి నిల్వలే జీవనాధారం

వర్షాలు తగ్గితే తొలుత ప్రభావం చూపేది నీటి వనరులపైనే. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, భూగర్భజలాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయి. ఒక వ్యవస్థలో నీటి లభ్యత తగ్గితే దాని ప్రభావం మిగతా వ్యవస్థలపైనా పడుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకరంగా ఉన్నాయి. మొత్తం 585 టీఎంసీల సామర్థ్యానికి గాను 179.63 టీఎంసీల నిల్వలే ఉన్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. భూగర్భజలాల పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. బోర్లు, బావుల్లో నీటి మట్టాలు పడిపోతే సాగునీటికే కాదు.. తాగునీటికీ ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాలు, మెట్ట భూములు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉంది.

పల్లెల నుంచి పట్టణాల దాకా ప్రభావం

కరవు అంటే కేవలం పొలాలు ఎండిపోవడం మాత్రమే కాదు. పశువులకు మేత, నీరు దొరకకపోవడం, పాల ఉత్పత్తి తగ్గడం, పశుపోషణ భారంగా మారడం వంటి సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తగ్గితే ప్రజలు పట్టణాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో విద్యుత్తు వినియోగం పెరుగుతుంది. నీటి సరఫరా కోసం అదనపు విద్యుత్తు అవసరమవుతుంది. భూగర్భజలాలను తోడేందుకు మోటార్ల వినియోగం పెరగడం కూడా విద్యుత్తు వ్యవస్థపై భారాన్ని పెంచుతుంది. అంటే ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా అనేక రంగాలకు విస్తరించే ప్రమాదం ఉంది.

ప్రకృతి వైపరీత్యానికి ప్రణాళికే విరుగుడు

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ స్పందన తక్షణ ఉపశమనానికి పరిమితం కాకూడదు. ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ అంచనా, క్షేత్రస్థాయి అమలు సమాంతరంగా సాగాలి. ఇప్పటికే 31 జిల్లాల్లోని 365 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో 111 మండలాలు తీవ్ర కరవు, 254 మండలాలు మధ్యస్థ కరవు పరిస్థితులను ఎదుర్కొంటు న్నాయి. ఈ ప్రకటన కాగితాలకే పరిమితం కాకుండా బాధిత రైతులకు, ప్రజలకు వాస్తవ ప్రయోజనం చేకూర్చాలి. పంట నష్టాన్ని పారదర్శకంగా అంచనా వేయాలి. అర్హులైన రైతులకు పరిహారం, పెట్టుబడి సాయం, పంటల బీమా ప్రయోజనాలు సకా లంలో అందించాలి. ఉపాధి హామీ పనులను విస్తరించి గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించాలి. అందుబాటులో ఉన్న నీటి నిల్వలను ప్రాధాన్యతల ఆధారంగా వినియోగించాలి. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. సాగునీటి విషయంలో పంటల వారీగా, ప్రాంతాల వారీగా వాస్తవ పరిస్థితులను పరిగణ నలోకి తీసుకోవాలి. తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహిం చాలి. చెరువులు, కుంటల్లో పూడికతీత, వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, భూగర్భజలాల పునరుద్ధరణ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పట్టణాల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టే విధానాలను తప్పనిసరిగా అమలు చేయాలి. తాగునీటి సరఫరా లో అంతరాయాలు ఏర్పడకుండా గ్రామాల వారీగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. పశువులకు మేత, నీటి సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి బాధ్యత

కరవు వంటి ప్రకృతి సంబంధిత సమస్యలను రాజకీయ కోణంలో చూడటం వల్ల పరిష్కారం ఆలస్యమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు, వ్యవసాయ శాస్త్రవే త్తలు, రైతు సంఘాలు సమన్వయంతో పనిచేయాలి. కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం, విపత్తు నిధులు, ఇతర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ప్రయత్నించాలి. అదే సమయంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉండాలి. వర్షపాతం, భూగర్భజలాలు, జలాశయాల నిల్వలు, పంటల పరిస్థితులపై వారానికోసారి సమీక్ష జరగాలి. ప్రజలకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయాలి. ఎల్‌నినో ఎప్పుడు బలహీనపడుతుంది? రాబోయే వర్షాకాలం ఎ లా ఉంటుంది? అనే ప్రశ్నలకు ప్రకృతి మాత్రమే సమాధానం చెప్పగలదు. కానీ ఆ ప్రభావాన్ని ఎదుర్కొనే సన్నద్ధత మాత్రం మన చేతుల్లోనే ఉంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేక పోవడం.. కరవు వచ్చినప్పుడు నీటి కోసం పరుగులు తీయడం మనకు కొత్తేమీ కాదు. ఏటా ఎదురవుతున్న ఈ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకపోవడమే అసలు సమస్య. ప్రకృతి వైపరీత్యాల ను పూర్తిగా అడ్డుకోలేకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించుకోవ చ్చు. అందుకు తాత్కాలిక ప్రకటనలు కాదు.. దీర్ఘకాలిక కార్యా చరణ అవసరం. రైతు కంట కన్నీరు.. పల్లె గొంతులో దాహం.. ప్రజల జీవితాల్లో అనిశ్చితి కనిపిస్తున్న వేళ ప్రభుత్వానికి అసలైన పరీక్ష మొదలైంది. ఎల్‌నినోను సాకుగా చూపి బాధ్యతల నుంచి తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. ప్రకృతి విసిరిన సవాలు ను ఎదుర్కొనేందుకు పాలకులు, ప్రజలు కలిసికట్టుగా అడుగులు వేయాలి. ప్రతి వాన చినుకును ఒడిసిపట్టే సంస్కృతి.. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వాడే బాధ్యత.. ప్రతి రైతుకు అండగా నిలిచే వ్యవస్థ ఏర్పడినప్పుడే తెలంగాణ కరవు ముప్పును అధిగమిం చగలదు. లేకపోతే ఈ ఏడాది ఎల్‌నినో మిగిల్చే నష్టం వచ్చే ఏడాది కూడా వెంటాడుతూనే ఉంటుంది.

ఎల్‌నినో ఎప్పుడు బలహీనపడుతుంది? రాబోయే వర్షాకాలం ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలకు ప్రకృతి మాత్రమే సమాధానం చెప్పగలదు. కానీ ఆ ప్రభావాన్ని ఎదుర్కొనే సన్నద్ధత మాత్రం మన చేతుల్లోనే ఉంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేకపోవడం.. కరవు వచ్చినప్పుడు నీటి కోసం పరుగులు తీయడం మనకు కొత్తేమీ కాదు. ఏటా ఎదురవుతున్న ఈ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకపోవడమే అసలు సమస్య. ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా అడ్డుకోలేకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. అందుకు తాత్కాలిక ప్రకటనలు కాదు.. దీర్ఘకాలిక కార్యాచరణ అవసరం.



ఏదుల తిరుపతి
ఎడిటర్



కాంగ్రెస్ కుట్రలను భగ్నం చేస్తాం


- **ప్రజాస్వామ్యంపై మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీకి లేదు**
- **బ్రిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి**

ప్రజానావ, హైదరాబాద్: ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్య రాలు జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న బీజేపీ మహా పాదయాత్రలో ఆ మె పాల్గొన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఎనిమిది డివిజన్ల నుంచి తన ఆధ్వర్యంలో సుమారు 1,500 మంది తరలివచ్చారని తెలి పారు. ఓటు చోరీపై మాట్లాడే ముందు కాంగ్రెస్ తన చరిత్రను గుర్తు చేసుకోవాలని, నెహ్రూ ప్రధాని ఎన్నిక, ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ ఘటనలను ప్రస్తావించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్‌ను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరే కిస్తోందని ప్రశ్నించారు. నకిలీ ఓట్ల తొలగింపును అడ్డుకోవడం ప్రజాస్వా మ్యానికి నష్టమన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ నేతలు ఢిల్లీ పర్యటనలకు ప్రాధాన్యమి వ్వడం ఏమిటని నిలదీశారు. ఆ ఖర్చును ప్రజల తాగు, సాగునీటి సమ స్యల పరిష్కారానికి వెచ్చించాలని సూచించారు. కాంగ్రెస్ కుట్రలను బీజేపీ ప్రజల పక్షాన నిలబడి భగ్నం చేస్తుందని కీర్తిరెడ్డి స్పష్టం చేశారు.

ఉద్యమకారులకు సముచిత గుర్తింపు కల్పించాలి

- **ఉద్యమకారుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలి: మోతె శోభన్‌రెడ్డి**

న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు సముచిత గుర్తింపు, గౌరవం కల్పించాలని ప్రభుత్వ ఉద్యమకారుల గు ర్తింపు కమిటీ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి కోరారు. 'చలో ఢిల్లీ' కార్యక్ర మంలో భాగంగా తెలంగాణ భవన్ సమీపంలో నిర్వహించిన కార్యక్ర మంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తా యని, వారి సేవలను భావితరాలకు తెలియజేయాలని అన్నారు. ఉద్యమ కారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు వారికి గౌరవప్రదమైన గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం మరింత చొరవ చూపాలని ఆకాంక్షించారు.



గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువు పెంచాలి

- **నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు అవకాశం కల్పించాలి**
- **ఎన్నికల సంఘానికి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత విజ్ఞప్తి**

ప్రజానావ, హైదరాబాద్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువును నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు పొడిగిం చాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చే శారు. సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సి. సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజే శారు. ఓటరు నమోదు గడువు ఈ నెల 6తో ముగుస్తుండగా, ఎస్ ఐఆర్ ప్రక్రియ ఈ నెల 21 వరకు కొనసాగుతుందని, ఈ నేపథ్యం లో గడువు పొడిగించాలని కోరినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తికి సీఈ వో సానుకూలంగా స్పందించారని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎమ్మె ల్సీ ఎన్నికల్లో యువత, పట్టభద్రులు చురుగ్గా పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. ప్రతి ఎన్నికకు కొత్తగా ఓటరు నమోదు చేయాల్సి రావడం అభ్యర్థులకు భారంగా మారుతోందని, ఈ విధానంలో మార్పు తీసుకురావాలని ఎన్నికల సంఘాన్ని కోరనున్నట్లు తెలిపా రు. విద్యాసంస్థల యజమానులు తమ సంస్థల్లో పెద్ద ఎత్తున ఓట రు నమోదు చేయించడంపై కూడా ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ రిజిస్ట్రేషన్ కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెండింగ్‌లో ఉందని, ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని సీఈవోను కోరినట్లు కవిత వెల్లడించారు.



పదేళ్లలో మరో 500 గిగావాట్ల స్వచ్ఛ విద్యుత్

- **దశాబ్దం చివరి నాటికి పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల అంచనా**
- **ఇప్పటికే 300 గిగావాట్లకు చేరువలో శిలాజేతర విద్యుత్ సామర్థ్యం**
- **భారత్ ఇంధన భద్రతకు స్వచ్ఛ విద్యుత్తే కీలకం: ప్రధాని మోదీ**





న్యూఢిల్లీ: రానున్న 10–11 ఏళ్లలో దేశంలో మరో 500 గిగావాట్ల శిలాజేతర విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని జోడించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించా రు. పునరుత్పాదక ఇంధన రంగంలో దశాబ్దం చివరినాటికి రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు అవకాశాలున్నా యని తెలిపారు. సోమవారం ఢిల్లీలో ప్రారంభమైన భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పోలో ఆయన ప్రసంగించారు. దేశంలో ఇప్పటికే దాదాపు 300 గిగావాట్ల శిలాజేతర విద్యుత్ స్థాపిత సామర్థ్యం ఉందని మోదీ వెల్లడిం చారు. మొత్తం విద్యుత్ స్థాపిత సామర్థ్యంలో 50 శాతానికి పైగా స్వచ్ఛ ఇంధన వనరుల నుంచే లభిస్తోందన్నారు. పారి స్ వాతావరణ ఒప్పందం ప్రకారం 2030 నాటికి చేరుకోవా ల్సిన లక్ష్యాన్ని ఐదేళ్ల ముందే సాధించినట్లు పేర్కొన్నారు. రానున్న 10–11 ఏళ్లలో మరో 500 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించడం సవాలుతో కూడుకున్నదైనా, దేశ సామర్థ్యంపై తనకు నమ్మకం ఉందన్నారు. పశ్చిమాసియాలో కొనసాగు తున్న సంఘర్షణ సహా ప్రపంచ ఇంధన సంక్షోభాలు, ఇంధన భద్రతకు–ఆర్థిక భద్రతకు మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయని మోదీ అన్నారు. శిలాజ ఇంధనాల దిగుమతు లపై అధికంగా ఆధారపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. గత పదేళ్లలో స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ పెట్టిన పెట్టుబడులు బాహ్య పరిణామాల ప్రభావాన్ని తగ్గించేందుకు దోహదపడ్డా యని వివరించారు. గత పదేళ్లలో పునరుత్పాదక ఇంధన రం గంలో రూ.15 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. 2024లో జరిగిన రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ సమ్మిట్ తర్వాత రెండేళ్లలోనే సుమారు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు వెల్లడించారు. ఈ రంగంలో రాజకీ య, విధానపరమైన స్థిరత్వం ఉందని, పెట్టుబడిదారులు భా రత్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

సోలార్, గ్రీన్ హైడ్రోజన్‌పై దృష్టి

ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుప త్రులు, వీధి దీపాల వ్యవస్థలను సౌర విద్యుత్‌తో అనుసంధా నించాలని మోదీ సూచించారు. స్వదేశీ బ్యాటరీ నిల్వ పరి ష్కారాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా ఏటా 50 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా ముం దుకు సాగుతున్నట్లు తెలిపారు.

పునరుత్పాదక విద్యుత్‌ను అవసరమైన ప్రాంతా లకు తరలించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ కీలకమని పేర్కొన్నారు. దీని రెండో దశకు ప్రభుత్వం రూ.2 లక్షల కోట్ల కేటాయింపులు చేసిందన్నారు. ఇప్పటికే 44 వేలకు పైగా ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ సదుపాయం కల్పించా మని, తద్వారా ఏటా సుమారు రూ.700 కోట్లు ఆదా అవుతున్నాయని వివరించారు.

నాలుగు రోజుల పాటు సదస్సు

నవంబరు 2 నుంచి 5 వరకు నాలుగు రోజుల పాటు భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్–2026 జరగనుంది. 130కి పైగా దేశాల ప్రతినిధులు, 40 మందికి పైగా మంత్రులు, విధాన నిర్ణేతలు, పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు, పరిశ్రమ ల ప్రముఖులు ఇందులో పాల్గొననున్నారు. ఆస్ట్రేలియా, డె న్మార్క్, యూరోపియన్ యూనియన్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్, బ్రిటన్ దేశ భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) తొమ్మిదో అసెంబ్లీ సమావేశం, నాలుగో అంతర్జాతీయ గ్రీన్ హైడ్రోజన్ సదస్సు కూడా దీనితో పాటు జరగనున్నాయి.



నెట్ లేకుండానే ఏఐ

గూగుల్ కొత్త యాప్.. ఫోన్‌లోనే కృత్రిమ మేధ వినియోగం

వ్యక్తిగత సమాచారానికి భద్రత.. ప్రశ్నలకు తక్షణ సమాధానాలు

ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే ఏఐ సేవలను ఉపయోగించుకునే నదుపాయం అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ సాంకేతిక నంస్థ గూగుల్ 'ఏఐ ఎడ్జ్ గ్యాలరీ' పేరుతో కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఏఐ సేవలను ఉపయోగించుకోవాలంటే ఇంటర్నెట్ తప్పనిసరిగా ఉండాల్సి వచ్చేది. అయితే ఈ కొత్త యాప్‌తో ఫోన్‌లోనే ఏఐ నమూనాలను నేరుగా ఉపయోగించుకోవచ్చు. ఇంటర్నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లోనూ ఏఐ సేవలు పొందే అవకాశం కలుగుతుంది. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే.. వినియోగదారులు అందించే నమాచారం బయటి సర్వర్లకు వెళ్లదు. ఫోన్‌లోనే మొత్తం ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో వ్యక్తిగత నమాచారం గోప్యంగా ఉంటుంది. నమాచార భద్రతకు కూడా ఎక్కువ అవకాశం ఉంటుంది. సర్వర్ల నుంచి నమాధానాల కోసం వేచి చూడాల్సిన అవనరం లేకుండా ఫోన్‌లోనే వేగంగా ఫలితాలు పొందవచ్చు.

ఒకే యాప్‌తో ఎన్నో వనులు

ఈ యాప్ ద్వారా ప్రశ్నలకు నమాధానాలు తెలుసుకోవడంతో పాటు పాఠ్య నమాచారాన్ని రూపొందించవచ్చు. చిత్రాలను విశ్లేషించవచ్చు. కంప్యూటర్ ప్రోగ్రామ్‌లకు నంబంధించిన కోడ్ రాయవచ్చు. పత్రాలను పరిశీలించి వాటిలోని ముఖ్యమైన నమాచారాన్ని తెలుసుకోవచ్చు. అవనరాన్ని బట్టి వివిధ ఏఐ నమూనాలను ఎంచుకొని ఉపయోగించుకునే వీలుంది. విద్యార్థులు, ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు, కంటెంట్ నృష్టికర్తలకు ఇది ఉపయోగకరంగా ఉండనుంది.

త్వరలో ఐఫోన్లలోనూ..

గూగుల్ రూపొందించిన ఈ యాప్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ ఫోన్లలో అందుబాటులో ఉంది. ఓపెన్ సోర్స్ విధానంలో విడుదల చేయడంతో ఇతర సాఫ్ట్‌వేర్ నిపుణులు కూడా దీని సాంకేతికతను పరిశీలించి అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. త్వరలో ఐఫోన్‌ల కోసం కూడా ఈ యాప్‌ను విడుదల చేయనున్నట్లు గూగుల్ ప్రకటించింది. ఇంటర్నెట్‌పై ఆధారపడకుండా ఫోన్లలోనే ఏఐ సేవలను అందించే దిశగా ఈ యాప్ కీలక ముందడుగుగా నిలవనుంది.





మార్కెట్‌లోకి మళ్లీ కార్బన్ మొబైల్స్!

ఒకప్పుడు భారత మొబైల్ మార్కెట్‌ను ఏలిన కార్బన్ మొబైల్స్ మళ్లీ రంగంలోకి దిగుతోంది. అక్టోబరు 29న పునఃప్రవేశాన్ని ప్రకటించింది. దేశీయ తయారీకి కేంద్రం ప్రోత్సాహం, అంతర్జాతీయ బ్రాండ్ల ఫోన్ల ధరల పెరుగుదల స్థానిక నంస్థలకు అవకాశాలుగా మారుతున్నాయి.2000 దశకం చివర్లో కార్బన్, మైక్రోమ్యాక్స్, స్పైస్, లావా నంస్థలు తక్కువ ధరల ఫోన్లతో ఆదరణ పొందాయి. చైనా బ్రాండ్ల పోటీతో క్రమంగా వెనుకబడ్డాయి. ప్రస్తుతం విడిభాగాల ధరల పెరుగుదలతో స్మార్ట్‌ఫోన్లు భారమవుతున్నాయి. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రకారం 2026 జులై–సెప్టెంబరు త్రైమాసికంలో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 20 శాతం, రూ.20 వేల లోపు ఫోన్ల రవాణా 47 శాతం క్షీణించింది. తక్కువ ధరకు మెరుగైన ఫీచర్లు, నాణ్యమైన కెమెరా, అధిక బ్యాటరీ సామర్థ్యంతో ఫోన్లు అందిస్తే దేశీయ బ్రాండ్లకు మళ్లీ ఆదరణ లభించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే విక్రయానంతర సేవలు, సర్వీస్ నెట్‌వర్క్ కూడా కీలకం కానున్నాయి. ఇప్పటికే మివి, బోట్ నంస్థలు స్మార్ట్‌ఫోన్ రంగంలోకి ప్రవేశించగా, 2028 నాటికి స్వదేశీ పరిజ్ఞానంతో భారతీయ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకురావాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.



టచ్ డిస్‌ప్లేతోనే ప్రీమియం మ్యాక్‌బుక్ ప్రో

ఎంట్రీ మోడల్ ధర 1,999 డాలర్లు.. టచ్ మోడల్ ధర 2,899 డాలర్ల నుంచి

ప్రముఖ టెక్నాలజీ నంస్థ ఆపిల్ తన మ్యాక్‌బుక్ ప్రో లైనప్‌లో కీలక మార్పులకు సిద్ధమవుతోంది. 2027లో రెండో తరం టచ్ స్క్రీన్ మ్యాక్‌బుక్ ప్రో మోడళ్లను విడుదల చేసే నమయంలో.. టచ్ నదుపాయం లేని ప్రీమియం మోడళ్లను పూర్తిగా నిలిపివేయనున్నట్లు నమాచారం. బ్లూమ్‌బర్గ్‌కు చెందిన 'పవర్ ఆన్' వార్తా కథనం ఈ విషయాన్ని వెల్లడించింది.

ఎం7 చిప్‌తో ఎంట్రీ మోడల్

14 అంగుళాల మ్యాక్‌బుక్ ప్రో ఎం7 చిప్‌తో కొత్త రూపులో అందుబాటులోకి రానుంది. గత మోడళ్లతో పోలిస్తే మరింత నన్నగా, తేలికగా దీన్ని రూపొందించనున్నారు. అయితే ఈ ఎంట్రీ మోడల్‌లో టచ్ స్క్రీన్ నదుపాయం ఉండదు. ప్రస్తుతం దీని ప్రారంభ ధర 1,999 డాలర్లుగా ఉంది.

ధర భారీగానే

కొత్త ప్రో మోడళ్లలో ప్రోమోడ్ ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేలు, టచ్ నదుపాయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. 14 అంగుళాల మోడల్ ధర 2,899 డాలర్లు కాగా, 16 అంగుళాల మోడల్ ధర 3,399 డాలర్లుగా నిర్ణయించారు. ప్రస్తుత మోడళ్లతో పోలిస్తే ప్రారంభ ధరలోనే 400 డాలర్ల వ్యత్యానం ఉంది. 2027లోనూ ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే.. ఎంట్రీ మోడల్ నుంచి టచ్ డిస్‌ప్లే మోడల్‌కు మారేందుకు అదనంగా 900 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

ఏఐ సామర్థ్యాలకు ప్రాధాన్యం

రెండో తరం టచ్ మోడళ్లలో ఎం7 ప్రో, ఎం7 మ్యాక్స్ ప్రాసెనర్లను వినియోగించనున్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సామర్థ్యాలను మరింత మెరుగుపరచడంపై ఆపిల్ దృష్టి సారించనుంది. అధిక పనితీరు కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేనుకుని ఈ మోడళ్లను రూపొందించనుంది.

పాత మోడళ్లను కొనసాగించే వ్యూహం


కొత్త మోడళ్ల ధరలు అధికంగా ఉండటంతో వినియోగదారులపై ధరల భారం తగ్గించేందుకు పాత తరహా మోడళ్లను కొనసాగించడం ఆపిల్‌కు కొత్తేమీ కాదు. ముఖ్యంగా నంస్థలు, వ్యాపార నంస్థల కొనుగోళ్లకు తక్కువ ధరలో ప్రత్యామ్నాయం అందుబాటులో ఉంచడమే ఈ వ్యూహం వెనుక ఉద్దేశం. ప్రోలెడ్ ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేలతో కూడిన తాజా మ్యాక్‌బుక్ ప్రో మోడళ్ల విక్రయాలు నవంబర్ 6 నుంచి ప్రారంభం కానుండగా, ముందస్తు బుకింగ్స్ ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.



యూత్ టూరిజం క్లబ్ సింగింగ్ పోటీల్లో శ్రీనిక ప్రతిభ

- ప్రశంస పత్రం అందజేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజానావ, సిరిసిల్ల: యూత్ టూరిజం క్లబ్ కార్యక్రమంలో భాగంగా సింగింగ్ కాంపిటీషన్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రశంసా పత్రాన్ని అందుకున్న తంగళ్ళపల్లి మండలం మండెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని శ్రీనిక ను పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ వేముల మురళి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



అంతర్గాం అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిరసన దీక్ష

ప్రజానావ, పెద్దపల్లి : అంతర్గాం మండలంలో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిరసన దీక్ష చేపట్టారు. గత మూడేళ్లుగా మండల అభివృద్ధిని పాలకులు విస్మరించారని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల–అంతర్గాం వంతెన, కుర్సకం పట్టాల పంపిణీ, పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి, అంతర్గాంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ దీక్షలో రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి, వాల్య హరీష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆముల నారాయణ, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుటుంబ సమేతంగా భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ఎస్పీ

ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే కుటుంబ సమేతంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీ దంపతులకు అర్చకులు, వేద పండితులు మంత్రోచ్ఛారణలు, స్వస్తివచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఎస్పీ దంపతులకు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎల్. రమాదేవి లడ్డూ ప్రసాదాన్ని అందజేయగా, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ శేషవస్త్రంతో ఎస్పీ మహేష్ బి. గీతేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ వీర ప్రతాప్, పీఆర్వో పెరిక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే లక్ష్యం

- వేములవాడలో నిర్మల్ సీడ్స్ విత్తన సంస్థ
- పత్తి పంట క్షేత్ర ప్రదర్శన, రైతులకు అవగాహన
- హాజరైన 160 మందికి పైగా రైతులు

ప్రజానావ, వేములవాడ: రైతుల అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం అనే ధ్యేయంతో పనిచేస్తున్న ప్రముఖ విత్తన సంస్థ నిర్మల్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండల కేంద్రంలో పత్తి పంట క్షేత్ర ప్రదర్శన, రైతు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. స్థానిక రైతు నీలం శంకరయ్య తన పొలంలో సాగు చేసిన ఎన్సీహెచ్–4341 రకం పత్తి పంటను క్షేత్ర ప్రదర్శన కోసం ఎంచుకున్నారు. ఈ ప్రదర్శనలో పంట దిగుబడి, కాయల పరిమాణం, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన ఇతర రైతులు ఎంతో ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమానికి వేములవాడ పరిసర ప్రాంతాలలోని 8 గ్రామాల నుండి సుమారు 160 మంది రైతులు, 15 మంది ఆదర్శ రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిర్మల్ సీడ్స్ సంస్థ ప్రతినిధులు పత్తి సాగులో పాటించాల్సిన యజమాన్య పద్ధతులు, సరియైన ఎరువుల వినియోగం, దిగుబడి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ సీడ్స్ ఆర్.ఎం. సందీప్, డి.ఆర్.ఎం. లక్ష్మణ్, టెరిటోరియల్ ఆఫీస్ ప్రతినిధి మాధవరావు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్మల్ సీడ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని అందించడమే తమ సంస్థ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ఎన్సీహెచ్–4341 పత్తి రకం పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.



జిల్లావ్యాప్తంగా నాకాబంది

- అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తుల కట్టడికి విస్తృత తనిఖీలు
- వాహనాల డాక్యుమెంట్లు, నంబర్ ప్లేట్లు, అనుమానిత వ్యక్తుల వివరాల పరిశీలన
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



ప్రజానావ, సిరిసిల్ల: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడమే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా సోమవారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లు, మండల కేంద్రాలు, జిల్లా సరిహద్దుల్లో పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్వయంగా పాల్గొని తనిఖీలను పర్యవేక్షించారు. అనుమానిత వ్యక్తుల వివరాలతో పాటు వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తుల కదలికలను నియంత్రించడంతో పాటు నేరాల నివారణకు జిల్లా వ్యాప్తంగా తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు తనిఖీల ద్వారా నేరాలను అరికట్టి ప్రజలకు మరింత భద్రత కల్పించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం, మైనర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దొంగ వాహనాల గుర్తింపు, రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు నంబర్ ప్లేట్లు లేని వాహనాలను ఉపయోగించి చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేయడంలో ఈతనిఖీలు కీలకంగా నిలుస్తాయని తెలిపారు. జిల్లాలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గుర్తించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. పోలీసుల తనిఖీలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ లు సిబ్బంది ఉన్నారు.

జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల పాటు నవంబర్ 1వ తేది నుంచి 30వరకు జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్ధంగా డి.జే వినియోగించరాదని తెలిపారు.

శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. జిల్లా ప్రజలు పోలీసు వారికి ఈ విషయంలో సహకరించాలని శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్నివర్గాల ప్రజలు సహకారం అందించాలన్నారు.

గ్రీవెన్స్ డేలో 19 ఫిర్యాదులు



గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి 19 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్కి వచ్చిన ఫిర్యాదుదారుల ఫిర్యాదులు స్వీకరించి న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.



బొడ్డు వినయ్‌కు గోల్డ్ మెడల్

ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం పోచెట్టి పల్లి గ్రామానికి చెందిన బొడ్డు మల్లేశం కుమారుడు బొడ్డు వినయ్ అరుదైన ఘనత సాధించాడు. చెన్నైలో ఎంబీబీఎస్ చదువుతున్న వినయ్‌కు యూనివర్సిటీ తరఫున గోల్డ్ మెడల్‌తో పాటు డిస్టింక్షన్ లభించాయి. రైతు కుటుంబానికి చెందిన బొడ్డు మల్లేశం కుమారుడు వినయ్ తండ్రి చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం సంతోషంగా ఉందని కుటుంబికులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రజావాణికి 165 దరఖాస్తులు

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజానావ, సిరిసిల్ల : ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 165 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 06 దరఖాస్తులు, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 06 దరఖాస్తు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

మండలాల్లో స్వీకరణ

బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 03, ఇల్లంతకుంట మండలం 09, గంభీరావుపేట మండలం 06, కోనరావుపేట మండలం 06 ముస్తాబాద్ మండలం 05, తంగళ్లపల్లి మండలం 02, వీర్నపల్లి మండలం 03, వేములవాడ రూరల్ మండలం 01, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 02 చొప్పున వచ్చాయి. ఐడీఓసీ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



యాక్సిడెంట్ స్పాట్‌గా చంద్రంపేట చౌరస్తా

- ట్రాఫిక్ సిగ్నల్ చౌరస్తాలో ప్రమాదాల నివారణకు చర్యలు
- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల – కోనరావుపేట ప్రధాన రహదారి చంద్రంపేట ట్రాఫిక్ చౌరస్తాలో సిగ్నల్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు పెచ్చు పెరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు చర్యలలో భాగంగా సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, ప్రజా ప్రతినిధులు, చంద్రంపేట చౌరస్తాను. పరిశీలించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థానిక 12 వార్డు సిరిసిల్ల 2వ బైపాస్ రోడ్డు లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిందిగా స్థానిక కౌన్సిలర్ మొగిలి నాగరాజు, బుర బాలు తమ దృష్టికి తేవడంతో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డు డివైడర్‌పై వాహనదారులకు రోడ్డు కనిపించకుండా పెరిగిన చెట్ల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో కూడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించినట్టు తెలిపారు. డివైడర్‌పై వాహనదారులకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి ఈ చౌరస్తా వద్ద ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని, వాహనదారులు మరియు ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని, అలాగే రోడ్డు ప్రమాద నివారణ చర్యలో భాగంగా మున్సిపల్ నుండి అందించవలసిన పూర్తి సహకారాలు అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. వాహనదారులు కూడ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని, ప్రతి ఒక్కరూ వాహనాలకు ఇన్సూరెన్స్ ను కలిగి ఉంటూ వారి వాహనాల కండిషన్ ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన మరమ్మతులను చేయించుకుంటూ ఉండాలని, ప్రజలు బాటసారులు కచ్చితంగా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ రోడ్డును దాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి,వార్డు ప్రజలు ఉన్నారు.



నేడు సిరిసిల్లలో ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలు

ప్రజానావ, సిరిసిల్ల : తెలుగు ఫోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలను సిరిసిల్ల పట్టణ కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫోక్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ సత్తర్, అధ్యక్షులు పత్తిపాటి రమణకర్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 3న నిర్వహించనున్న ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను సోమవారం పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఇంత పెద్ద ఎత్తున వివిధ రంగాలకు చెందిన కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి నిర్వహిస్తున్న కార్యక్రమం తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలని పేర్కొన్నారు. ఈ వేడుకలకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి కవులు, కళాకారులు, టెక్నీషియన్లు, కెమెరామెన్లు, సినీ రంగంలోని 24 క్రాఫ్ట్స్‌కు చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారని తెలిపారు. మంగళవారం సాయంత్రం సిరిసిల్ల పాత బస్టాండ్ నుంచి కళాకారుల భారీ ర్యాలీ ప్రారంభమై సభా వేదిక వరకు కొనసాగుతుందని వెల్లడించారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కళాకారులకు కూడా అందించాలని డిమాండ్ చేశారు.

టీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎండీ ఉమర్

ప్రజానావ, కరీంనగర్: తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ఎండీ ఉమర్ నియమితులయ్యారు. ఈ మేరకు టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బల్లికొండ తేజస్విని నియమితులయ్యారు. ఈ క్రమంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి అంకం శివరాణితో కలిసి హైదరాబాదులోని కవిత నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన నియామకంపై సంతోషం వ్యక్తం చేసిన ఉమర్ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన అధ్యక్షురాలు కవిత, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా, నియోజకవర్గ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుండి పోరాడతానన్నారు. పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు.





ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా నగరాన్ని వాయు కాలుష్యం, పొగమంచు కమ్మేశాయి. వాతావరణంలో దుమ్ము, కాలుష్య కారకాలు పేరుకుపోవడంతో నగరవ్యాప్తంగా మసక వాతావరణం నెలకొంది. దీంతో ఎత్తైన భవనాలు, నివాస సముదాయాలు, రహదారులు పొగమంచు తెరల వెనుక కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సెక్టార్–44 పరిసరాల్లో నగర ఆకాశహర్మ్యాలు సైతం పొగమంచులో కలిసిపోయినట్లు కనిపించాయి. కాలుష్య తీవ్రతతో గాలిలో స్పష్టత తగ్గి, దూరంలోని ప్రాంతాలు సరిగా కనిపించని పరిస్థితి నెలకొంది. సోమవారం నోయిడాలోని సెక్టార్–44 నుంచి డ్రోన్ ద్వారా చిత్రీకరించిన నగర దృశ్యమిది.

– నోయిడా

మళ్లీ మెరిసిన బంగారం

దీపావళి కొనుగోళ్లతో జోరందుకున్న పసిడి అమ్మకాలు

- 10 గ్రాములపై రూ.500 పెరిగిన ధర.. స్థిరంగా వెండి
- అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పెరిగిన ధరలు

న్యూఢిల్లీ: దీపావళి పండుగ కొనుగోళ్ల ఊపందుకోవడంతో దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు సోమవారం స్వల్పంగా పెరిగాయి. 10 గ్రాముల పసిడిపై రూ.500 పెరగడంతో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.1,42,500కు చేరింది. శనివారం ఇది రూ.1.42 లక్షల వద్ద ముగిసింది. వెండి ధర మాత్రం ఎలాంటి మార్పు లేకుండా కిలో రూ.1.86 లక్షల వద్ద స్థిరంగా కొనసాగింది. దీపావళిని దృష్టిలో పెట్టుకుని ఆభరణాల వ్యాపారులు, రిటైలర్లు కొనుగోళ్లు పెంచడంతో దేశీయ మార్కెట్‌లో బంగారానికి మద్దతు లభించిందని ట్రేడర్లు తెలిపారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం కూడా దిగుమతి చేసుకునే బంగారం ధర పెరగడానికి కారణమైంది. అక్టోబరులో భారీగా పడిపోయిన పసిడి ధరలు తాజాగా కొంత కోలుకున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. సెప్టెంబరు 30న 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,300 ఉండగా, అక్టోబరులో రూ.7,300 తగ్గింది. ఇదే సమయంలో కిలో వెండి ధర కూడా రూ.2.32 లక్షల నుంచి రూ.46 వేలు పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 24.18 డాలర్లు (దాదాపు ఒక శాతం) పెరిగి 3,899.73 డాలర్లకు చేరింది. వెండి ధర రెండు శాతానికి పైగా పెరిగి 50.25 డాలర్లకు చేరుకుంది. అక్టోబరు చివర్లో జరిగిన అమ్మకాల ఒత్తిడి నుంచి



బంగారం కోలుకునే ప్రయత్నం చేసిందని లెమన్ బ్రోకరేజ్ సంస్థ పరిశోధన విభాగాధిపతి గౌరవ్ గార్గ్ తెలిపారు. అయితే అధిక చమురు ధరలు పసిడి పెరుగుదలకు అడ్డంకిగా మారుతున్నాయని పేర్కొన్నారు.


కొనసాగనున్న ఒడుదొడుకులు

అమెరికాలో వడ్డీ రేట్లు అధిక స్థాయిలో కొనసాగవచ్చన్న అంచనాలు, నవంబరు 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని ఎలకోపీ సెక్యూరిటీస్ విశ్లేషకుడు జతీన్ త్రివేది తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, ఔన్సు ధర 4వేల డాలర్ల దిగువన ఉండటంతో సమీప కాలంలో ధరలు తగ్గే అవకాశాన్ని తోసిపుచ్చలేమని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ విభాగాధిపతి అభిప్రాయపడ్డారు.

ఐదు దేశాల్లో బిల్‌బోర్డుల హ్యాకింగ్

- ప్రకటనల స్థానంలో అశ్లీల దృశ్యాల ప్రసారం
- భద్రతా లోపాలే లక్ష్యంగా దాడులంటున్న హ్యాకర్లు

కైరో: ఐదు దేశాల్లో డిజిటల్ బిల్‌బోర్డులను హ్యాకర్లు హైజాక్ చేసి, వాటిపై అశ్లీల దృశ్యాలను ప్రసారం చేశారు. ఈజిప్ట్, మలేషియా, బ్రెజిల్, చైనా, ఇరాక్‌లలో గత వారం ఈ ఘటనలు చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ప్రకటనల సంస్థలు పలు బిల్‌బోర్డులను తాత్కాలికంగా నిలిపివేశాయి. ఈజిప్ట్ రాజధాని కైరోలో రద్దీగా ఉండే రహదారిపై బిల్‌బోర్డులో అశ్లీల దృశ్యాలు కనిపించడంతో వాహనదారులు షాక్‌కు గురయ్యారు. కొందరు వాటిని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బిల్‌బోర్డుల నిర్వహణ సంస్థ వెబ్‌సైట్‌పై సైబర్ దాడి జరిగినట్లు ఈజిప్ట్ ప్రభుత్వం వెల్లడించింది. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది. టెలిగ్రామ్‌లో 'Leakers$' పేరుతో ఉన్న హ్యాకర్ల బృందం ఈ దాడులకు బాధ్యత వహించింది. ఎల్‌ఈడీ స్క్రీన్లకు ప్రకటనలను పంపే సాఫ్ట్‌వేర్‌లోని భద్రతా లోపాలను



ఉపయోగించుకుని వాటిని హ్యాక్ చేసినట్లు ప్రకటించింది. డబ్బు కోసం కాకుండా, ప్రకటనల సంస్థల భద్రతా వైఫల్యాలను ఎత్తిచూపేందుకే ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. ఇంటర్నెట్‌కు అనుసంధానమైన స్క్రీన్లకు తగిన రక్షణ కల్పించడంలో సంస్థలు విఫలమవుతున్నాయని విమర్శించింది.

ఇండిపెండెన్స్ బిస్కెట్లలో కొత్త రుచులు

- ఒకేసారి తొమ్మిది వేరియంట్లను పరిచయం చేసిన రిలయన్స్
- 28 కొత్త ఉత్పత్తులతో విస్తరించిన పోర్ట్‌ఫోలియో
- తొలుత తమిళనాడులో అందుబాటులోకి.. దశలవారీగా విస్తరణ

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ రంగంలో తన ఉనికిని మరింత విస్తరించడంపై రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్) దృష్టి సారించింది. ఇందులో భాగంగా తన ఇండిపెండెన్స్ బిస్కెట్ల శ్రేణిలో తొమ్మిది రకాల కొత్త వేరియంట్లను ప్రకటించింది. మొత్తం 28 కొత్త ఉత్పత్తులను సోమవారం నుంచి తమిళనాడు మార్కెట్లో అందుబాటులోకి తెచ్చింది. దశలవారీగా ఇతర రాష్ట్రాలకూ విస్తరించనున్నట్లు వెల్లడించింది. కొత్త ఉత్పత్తుల్లో పవర్ అప్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పాలు, గ్లూకోజ్, ప్రొటీన్ కలయికతో దీనిని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. బిస్కెట్ల వ్యాపారానికి తమిళనాడు కీలక మార్కెట్ అని, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ వినియోగదారులకు మరిన్ని ఎంపికలు అందించనున్నట్లు ఆర్‌సీపీఎల్ డైరెక్టర్ టి.కృష్ణకుమార్ పేర్కొన్నారు.



విస్తృత విక్రయ నెట్‌వర్క్

అజిత్ కుమార్ రేసింగ్‌తో బ్రాండ్ అనుబంధాన్ని ఉపయోగించుకుని పవర్ అప్‌కు ప్రచారం కల్పించనున్నారు. జనరల్ ట్రేడ్, ఆధునిక రిటైల్ దుకాణాలు, ఈ–కామర్స్, రిలయన్స్ రిటైల్, హోల్‌సేల్ మార్గాల్లో ఉత్పత్తులను విక్రయించనున్నారు. ఇండిపెండెన్స్ బ్రాండ్‌తో సాధారణ, ప్రత్యేక రుచుల బిస్కెట్లను విస్తరిస్తూనే.. భాగస్వామి మాలిబన్ ద్వారా ప్రీమియం ఉత్పత్తులను అందించడంపై సంస్థ దృష్టి పెట్టింది.

ట్రంప్ నివాసానికి సమీపంలో ఘోర విమాన ప్రమాదం

ఫ్లోరిడా: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో తొమ్మిది మందితో వెళ్తున్న బిజినెస్ జెట్ అదుపుతప్పి రోడ్డుపై కూలిపోయింది. నేలను తాకగానే భారీ అగ్నిగోళంగా పేలిపోవడంతో విమానంలోని వారంతా ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతకు రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడింది. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం టెక్సాస్‌లోని ఆస్టిన్ నుంచి బహమాస్‌కు బయల్దేరిన విమానం.. పామ్ బీచ్ కౌంటీలో కూలిపోయింది. ట్రంప్ రిసార్ట్ 'మార్–ఎ–లాగో'కు 14 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. జనావాసాలు, వాహనాలకు దూరంగా విమానం కూలడంతో భారీ ప్రాణనష్టం తప్పింది.ప్రమాదానికి ముందు విమానం వేగంగా ఎత్తును కోల్పోతోందని సిబ్బంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు 'మేడే' సందేశం పంపారు. 'మాకు సమయం లేదు' అంటూ వారు ఆందోళన వ్యక్తం చేసిన ఆడియో బయటకు వచ్చింది. ప్రమాద కారణాలపై అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, జాతీయ రవాణా భద్రతా బోర్డు దర్యాప్తు చేపట్టాయి.

తగ్గిన పంట వ్యర్థాల దహనం

- ఏడు రాష్ట్రాల్లో 26.63 శాతం తగ్గిన ఘటనలు
- రెండు నెలల్లో 3,316 కేసులు.. ఒక్క పంజాబ్‌లోనే 1,514
- యంత్రాల కొనుగోలుకు రైతులకు కేంద్రం సబ్సిడీ
- ప్రత్యామ్నాయ వినియోగంపై ప్రోత్సాహం

న్యూఢిల్లీ: పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిన వరి గడ్డిని తగులబెట్టే ఘటనలు ఈ ఏడాది గణనీయంగా తగ్గాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఏడు రాష్ట్రాల్లో 26.63 శాతం క్షీణించాయి. ఈ ఏడాది సెప్టెంబరు 15 నుంచి నవంబరు 1 వరకు మొత్తం 3,316 ఘటనలు నమోదయ్యాయి. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఉపగ్రహ చిత్రాల ఆధారంగా సేకరించిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. అయితే మొత్తం ఘటనల్లో దాదాపు సగం ఒక్క పంజాబ్‌లోనే నమోదవడం గమనార్హం. వరి గడ్డి దహనం ఘటనల్లో పంజాబ్ 1,514 కేసులతో మొదటి స్థానంలో నిలిచింది. రాజస్థాన్‌లో 671, మధ్యప్రదేశ్‌లో 566, ఉత్తరప్రదేశ్‌లో 345, ఉత్తరాఖండ్‌లో 176, హరియాణాలో 42, ఢిల్లీలో రెండు ఘటనలు నమోదయ్యాయి. పంజాబ్‌లో అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, కపుర్తలా, సంగ్రూర్, భటిండా, ఫరీద్‌కోట్, పటియాలా, బర్నాలా, ఫజిల్కా జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపించింది. రాజస్థాన్‌లో బారన్, బుండీ, గంగానగర్, హనుమాన్‌గఢ్, కోటా, సవాయ్ మాధోపూర్ జిల్లాల్లో, మధ్యప్రదేశ్‌లో షియోపూర్, సెహోర్, నర్మదాపురం, గుణ, దతియా, అశోక్‌నగర్ జిల్లాల్లో అధికంగా ఘటనలు నమోదయ్యాయి.



గోధుమల సాగు కోసం ఆతృత

వరి కోత పూర్తయిన తర్వాత గోధుమ విత్తనానికి పొలాలను సిద్ధం చేసుకునేందుకు రైతులకు కేవలం 10 నుంచి 25 రోజుల వ్యవధి మాత్రమే ఉంటుంది. ఈ తక్కువ సమయంలో పొలాల్లో మిగిలిన గడ్డిని తొలగించడం వారికి సవాలుగా మారుతోంది. యంత్రాలతో కోత కోసినప్పుడు మిగిలే గడ్డి, మొక్లను చేతులతో తొలగించడం కష్టతరంగా ఉండటంతో చాలామంది రైతులు వాటిని తగులబెడుతున్నారు. గడ్డిని తొలగించే యంత్రాలు అందుబాటులో లేకపోవడం, వాటి అద్దె లేదా కొనుగోలు ఖర్చు అధికంగా ఉండటం కూడా ఇందుకు కారణమవుతోంది. గోధుమ విత్తనం ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో తక్కువ ఖర్చుతో పొలాన్ని సిద్ధం చేసుకునే మార్గంగా దహనాన్ని ఎంచుకుంటున్నారు.

యంత్రాల కొనుగోలుకు రాయితీలు

పంట వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీలు అందిస్తోంది. వ్యక్తిగత రైతులకు వ్యవసాయ యంత్రాల కొనుగోలుపై 50 శాతం, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు), పారిశ్రామికవేత్తలకు 80 శాతం వరకు రాయితీ కల్పిస్తోంది. హ్యాపీ సీడర్, సూపర్ సీడర్, బేలర్లు, మల్చర్లు, స్ట్రా ఛాపర్ల కొనుగోలుకు ఈ సాయం అందిస్తోంది. చిన్న రైతులు కూడా వీటిని వినియోగించుకునేలా కస్టమ్ హైరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

పంట వ్యర్థాలతో ప్రత్యామ్నాయ ప్రయోజనాలు

వరి గడ్డిని తగులబెట్టకుండా పొలంలోనే కలియదున్నడం, మల్చింగ్ చేయడం వంటి పద్ధతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అంతేకాకుండా పంట వ్యర్థాలతో బయోమాస్ గుళికలు, బ్రికెట్లు తయారు చేయడంతోపాటు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఇంధనంగా వినియోగించేలా చర్యలు చేపడుతోంది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) ఉపగ్రహాల ద్వారా పంట గడ్డి దహనాన్ని పర్యవేక్షించడంతో పాటు ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తోంది. వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే కార్యక్రమాలనూ అమలు చేస్తోంది.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

- సహాయ కేంద్రం, ఆశ్రయ భవనంపై బాంబుల వర్షం
- 26మంది మృతి.. 20 మంది గల్లంతు

కీవ్: ఉక్రెయిన్‌లోని జపోరిజియా ప్రాంతం కొమిషువాఖా గ్రామంలో సోమవారం రష్యా జరిపిన బాంబు దాడుల్లో 26 మంది మరణించారు. మానవతా సహాయ పంపిణీ కేంద్రంగా ఉపయోగిస్తున్న పాఠశాల భవనం, సమీపంలోని ఆశ్రయ కేంద్రాన్ని రష్యా లక్ష్యంగా చేసుకుందని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. మరో 20 మంది గల్లంతయ్యారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రష్యా ఉద్రిక్తతలను తగ్గించాలని కోరుకోవడం లేదనడానికి ఈ దాడులే నిదర్శనమని అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ విమర్శించారు. ఉక్రెయిన్ వద్ద రక్షణ క్షిపణుల కొరత ఉన్న సమయంలో దాడులు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం సహాయక చర్యలు చేపట్టగా, రష్యా డ్రోన్ల దాడులు ఆటంకం కలిగించాయి.

ముగిసిన కాల్పుల విరమణ

దక్షిణ ఉక్రెయిన్‌లోని ఖేర్సన్ ప్రాంతంలో అక్టోబరు 27న ప్రారంభమైన పరిమిత కాల్పుల విరమణ సోమవారంతో ముగిసింది. రష్యా ఆధీనంలోని ఒలెష్కీ నగరంలో సహాయ పంపిణీ, ప్రజల తరలింపు కోసం ఈ విరామం కుదిరింది. మరోవైపు, ఖార్కివ్, ఒడెసాల్లో రష్యా డ్రోన్ దాడుల్లో 17 మంది గాయపడ్డారు. ఉక్రెయిన్ ప్రయోగించిన 212 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. ఉక్రెయిన్, రష్యాల్లో ప్రభుత్వ మొబైల్ యాప్‌లను హ్యాక్ చేసి నకిలీ అత్యవసర హెచ్చరికలు పంపినట్లు అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌లో అణు ముప్పు,



రేడియేషన్ ప్రమాదంపై తప్పుడు సందేశాలు వెలువడ్డాయి. రష్యాలోని 33 ప్రాంతాల్లోనూ నకిలీ హెచ్చరికలు పంపినట్లు ఆ దేశ అత్యవసర పరిస్థితుల శాఖ వెల్లడించింది. సైబర్ భద్రతను పటిష్ఠం చేయాలని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ సూచించారు.

సుదీర్ఘ నిరీక్షణకు తెర!

తొలిసారి ప్రపంచ నంబర్‌వన్‌గా జర్మనీ స్టార్ జ్వెరెవ్

- ఒకే ఏడాదిలో రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు
- 50ఏళ్ల తర్వాత అత్యధిక వయసులో అగ్రస్థానానికి
- సినర్‌కు రెండు, అల్కరాజ్‌కు మూడో స్థానం
- టాప్ 10లోకి స్పెయిన్‌కు చెందిన 20 ఏళ్ల రఫేల్ జోడార్

లండన్: జర్మనీ టెన్నిస్ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ఎట్టకేలకు ప్రపంచ పురుషుల టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అధిరోహించాడు. సోమవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన అతడు.. తన సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. ఈ ఏడాది అద్భుత ప్రదర్శనతో రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన 29 ఏళ్ల జ్వెరెవ్.. సీజన్‌ను కూడా అగ్రస్థానంలోనే ముగించడం ఖాయమైంది. జూన్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఫ్లావియో కొబొల్లిని ఓడించి జ్వెరెవ్ టైటిల్ సాధించాడు. సెప్టెంబరులో జరిగిన యూఎస్ ఓపెన్ ఫైనల్లో బెన్ షెల్టన్‌పై విజయం సాధించి రెండో గ్రాండ్‌స్లామ్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఏడాది వింబుల్డన్ ఫైనల్ చేరినా జానిక్ సినర్ చేతిలో ఓటమి చవిచూశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్ వరకు చేరుకున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 65 విజయాలు, 17 పరాజయాలు నమోదు చేశాడు. పురుషుల టెన్నిస్ చరిత్రలో నంబర్‌వన్ ర్యాంకు సాధించిన 30వ ఆటగాడిగా జ్వెరెవ్ నిలిచాడు. 50 ఏళ్లకు పైగా కాలంలో తొలిసారి అగ్రస్థానానికి చేరిన అత్యధిక వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 1974లో 30 ఏళ్ల వయసులో నంబర్‌వన్ అయిన జాన్ న్యూకోంబ్ మాత్రమే అతడి కంటే పెద్ద వయసులో ఈ ఘనత సాధించాడు. కొన్ని అత్యుత్తమ విజయాల కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. ఈ స్థానం దక్కడం ఎంతో సంతోషంగా ఉంది అని జ్వెరెవ్ పేర్కొన్నాడు.

సినర్ రెండో స్థానానికి..

గత ఏప్రిల్ 13 నుంచి అగ్రస్థానంలో కొనసాగిన జానిక్ సినర్ రెండో ర్యాంకుకు పడిపోయాడు. కార్లోస్ అల్కరాజ్ మూడో స్థానంలో ఉన్నాడు. కుడి మోకాలిలో వాపు కారణంగా సినర్ మూడు వారాల క్రితమే ఈ సీజన్‌కు ముగింపు పలికాడు. జ్వెరెవ్ ఈ వారం పారిస్ మాస్టర్స్‌లో తొలిసారి నంబర్‌వన్ హోదాలో బరిలోకి దిగనున్నాడు. జర్మనీ నుంచి బోరిస్ బెకర్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో పురుష ఆటగాడిగా నిలిచాడు. ర్యాంకింగ్స్‌లో మరో విశేషం స్పెయిన్‌కు చెందిన 20 ఏళ్ల రఫేల్ జోడార్ టాప్–10లోకి ప్రవేశించడం. ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో ఏడాది లోపే టూర్ అరంగేట్రం చేసిన అతడు కేవలం 287 రోజుల్లోనే పదో ర్యాంకుకు చేరాడు. గతంలో గుస్తావో కుయెర్టెన్ పేరిట ఉన్న 490 రోజుల రికార్డును అధిగమించాడు.

వివాదాల నేపథ్యం

జ్వెరెవ్ అగ్రస్థానానికి చేరడం మరోవైపు గతంలో ఎదుర్కొన్న ఆరోపణల నేపథ్యంలోనూ చర్చనీయాంశమైంది. అతడి మాజీ ప్రేయసులు ఇద్దరు శారీరక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపించారు. 2020 నాటి ఒక కేసు జర్మనీ ప్రాసిక్యూటర్లు, జ్వెరెవ్ న్యాయవాదులు, మాజీ భాగస్వామి మధ్య ఒప్పందంతో ముగిసింది. మరో ఆరోపణపై విచారణ జరిపిన ఏటీపీ 2023 జనవరిలో తగిన ఆధారాలు లేవని ప్రకటించింది.



కోహ్లీకే సెంచరీ చేసే అవకాశం ఎక్కువ

- పరిస్థితులకు అనుగుణంగా రోహిత్ బ్యాటింగ్‌లో మార్పులు
- హోరాహోరీగా సాగనున్న వన్డే సిరీస్
- టీమిండియా మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా
- గంభీర్‌కు ఈ టెస్టు సిరీస్ కీలకం : అభిషేక్ నాయర్



న్యూఢిల్లీ: భారత్–న్యూజిలాండ్ మధ్య జరగనున్న వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ సెంచరీలు సాధించే అవకాశాలు రోహిత్ శర్మ కంటే ఎక్కువగా ఉన్నాయని భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అభిప్రాయపడ్డాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే కోహ్లీకి ఇన్నింగ్స్‌ను నిర్మించుకునేందుకు తగినంత సమయం, అవకాశం ఉంటాయని విశ్లేషించాడు. న్యూజిలాండ్ పరిస్థితులకు అనుగుణంగా రోహిత్ బ్యాటింగ్ పాత్రలోనూ మార్పులు ఉండవచ్చని పేర్కొన్నాడు. భారత్–న్యూజిలాండ్ మధ్య జరగనున్న ఐదు వన్డేల సిరీస్ 2–2తో ముగుస్తుందని పుజారా అంచనా వేశాడు. వర్షం కారణంగా ఒక మ్యాచ్ రద్దయ్యే అవకాశముందని పేర్కొన్నాడు. సిరీస్ మధ్యలో భారత జట్టు కూర్పులో మార్పులు చోటుచేసుకోనుండటంతో న్యూజిలాండ్‌కు స్వల్ప ఆధిక్యం ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు. అయితే తొలి మూడు వన్డేల్లో టీమిండియా ఆధిపత్యం ప్రదర్శిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశాడు.

చివరి రెండు వన్డేలకు మార్పులు

తొలి మూడు వన్డేల్లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ ఆడనుండగా.. నవంబరు 19 నుంచి ప్రారంభమయ్యే టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు చివరి రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నారు. దీంతో భారత జట్టు కూర్పులో మార్పులు తప్పవని పుజారా పేర్కొన్నాడు. కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం చివరి రెండు వన్డేల్లో న్యూజిలాండ్‌కు అనుకూలంగా మారవచ్చని విశ్లేషించాడు.

గంభీర్‌కు పరీక్ష

న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్ భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు కీలకం కానుందని మాజీ బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయపడ్డాడు. 2024లో సొంతగడ్డపై కివీస్ చేతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయిన భారత్.. ఈసారి విజయంతో బదులివ్వాలని పేర్కొన్నాడు. టెస్టులకు సన్నద్ధమయ్యేందుకు గిల్, రాహుల్‌లకు మరింత విరామం ఇచ్చి ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు. వన్డే జట్టులో యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కకపోవడంపై సెలక్టర్లు అతడితో చర్చించి ఉంటారని నాయర్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

ఐఓఏ ఎన్నికల బరి నుంచి కిడాంబి శ్రీకాంత్ ఔట్

- తొమ్మిది స్థానాలకు 10 మంది పోటీ
- బరిలో సింధు, మీరాబాయి చాను
- రేపు ఆన్‌లైన్‌లో ఎన్నికలు

న్యూఢిల్లీ: భారత స్టార్ బ్యాడ్మింటన్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్ భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్ల కమిషన్ ఎన్నికల నుంచి తప్పుకున్నాడు. దీంతో తొమ్మిది స్థానాలకు 10 మంది పోటీలో మిగిలారు. మంగళవారం ఆన్‌లైన్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఒలింపిక్ పతక విజేతలు పీవీ సింధు, మీరాబాయి చాను ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. కయాకింగ్, కానోయింగ్ క్రీడాకారుడు మంజీత్ సింగ్ పతక విజేతల విభాగంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మిగిలిన స్థానాల్లో నలుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎన్నుకోనున్నారు. హాకీ కెప్టెన్లు హర్మన్‌ప్రీత్ సింగ్, సలీమా టెటె, షూటర్ స్వప్నిల్ కుసాలే, ఫెన్సర్ భవానీ దేవి, మాజీ ఆర్చర్ బొంబైలా దేవి తదితరులు బరిలో ఉన్నారు. 34మంది సభ్యుల ఎలక్టోరల్ కాలేజీ ఈ ఎన్నికల్లో ఓటు వేయనుంది. ఎన్నికైన సభ్యులు 2026–2030 వరకు నాలుగేళ్లపాటు బాధ్యతలు నిర్వహిస్తారు. కమిషన్ నుంచి ఒక పురుషుడు, ఒక మహిళ ఐఓఏ కార్యవర్గంలోనూ సభ్యులుగా ఉంటారు.

చెన్నై ఓపెన్‌కు వరుణుడి బ్రేక్



- తొలి రోజు ఒక్క మ్యాచ్ కూడా జరగని వైనం
- నేటికి వాయిదా పడిన 10 మ్యాచ్‌లు
- మొత్తం 16 తొలి రౌండ్ సింగిల్స్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు

చెన్నై: డబ్ల్యూటీఏ–250 చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నీకి వర్షం ఆటంకం కలిగించింది. సోమవారం జరగాల్సిన తొలి రోజు ప్రధాన డ్రా మ్యాచ్‌లన్నీ వర్షార్పణమయ్యాయి. షెడ్యూల్ ప్రకారం 10 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉండగా.. ఎడతెరిపి లేని వర్షంతో ఒక్కటీ సాధ్యం కాలేదు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సిన పోటీలు తొలుత చిరుజల్లులు, ఆ తర్వాత భారీ వర్షం కారణంగా నిలిచిపోయాయి. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌లను మంగళవారానికి వాయిదా వేశారు. ఉదయం 11 గంటల నుంచి మొత్తం 16 తొలి రౌండ్ సింగిల్స్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. రాత్రి 11 గంటల తర్వాత మ్యాచ్‌లకు అనుమతి లేకపోవడంతో సోమవారం ఆటను పూర్తిగా రద్దు చేశారు. చెన్నైలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తుండగా.. బంగాళాఖాతంలో మురాను తుపాను ఆందోళన పెంచుతోంది. చెన్నైకి వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం తెల్లవారుజామున దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తుపాను తాకే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు తెలిసినప్పటికీ, డబ్ల్యూటీఏ క్యాలెండర్‌లో మరో సమయం అందుబాటులో లేకపోవడంతో ఇదే సమయంలో టోర్నీ నిర్వహించాల్సి వచ్చిందని టోర్నీ డైరెక్టర్ హితేన్ జోషి తెలిపారు.



ఐపీఓ బరిలోకి ఎస్‌ఈసీఎల్

- సెబీకి ప్రాథమిక పత్రాలు సమర్పించిన సంస్థ
- 66.81 కోట్ల షేర్లను విక్రయించనున్న కోలిండియా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థ కోలిండియా అనుబంధ సంస్థ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్‌ఈసీఎల్) ఐపీఓకు సిద్ధమైంది. ఈ మేరకు సెబీకి ప్రాథమిక పత్రాలు సమర్పించింది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో జరగనుంది. కోలిండియా తన వాటాలోని 66.81 కోట్ల షేర్లను విక్రయించనుంది. కొత్త షేర్ల జారీ లేనందున ఐపీఓ ద్వారా వచ్చే నిధులన్నీ కోల్ ఇండియాకే దక్కనున్నాయి. 1985లో ఏర్పాటైన ఎస్‌ఈసీఎల్ దేశంలోని ప్రధాన బొగ్గు ఉత్పత్తి సంస్థల్లో ఒకటి. 2025–26లో 176.29 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. ఇది దేశీయ ఉత్పత్తిలో 16.94 శాతం. సంస్థ వద్ద 4.61 బిలియన్ టన్నుల ధ్రువీకరించిన బొగ్గు నిల్వలున్నాయి. ప్రస్తుత ఉత్పత్తి స్థాయిని బట్టి ఇవి మరో 26 ఏళ్లకు సరిపోతాయని ఐపీఓ పత్రాలు వెల్లడించాయి. ఆర్థికంగానూ సంస్థ మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. 2026 సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలల్లో ఆదాయం రూ.16,593.7 కోట్లకు, నికర లాభం రూ.2,174.3 కోట్లకు చేరింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,140.9 కోట్లుగా ఉంది. కోలిండియా మరో అనుబంధ సంస్థ మహానది కోల్‌ఫీల్డ్స్ కూడా ఐపీఓకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది ప్రారంభంలో భారత్ కోకింగ్ కోల్ పబ్లిక్ ఇష్యూకు వచ్చిన విషయం తెలిసిందే.

యూపీఐ లావాదేవీలు రూ.31.53 లక్షల కోట్లు!



న్యూఢిల్లీ: పండగల కొనుగోళ్లు, ఈ–కామర్స్ సంస్థల ఆఫర్లతో అక్టోబరులో యూపీఐ లావాదేవీలు భారీగా పెరిగాయి. ఆ నెలలో 2,547 కోట్ల లావాదేవీలు జరగ్గా, వాటి విలువ రూ.31.53 లక్షల కోట్లకు చేరింది. రోజువారీ సగటు లావాదేవీల సంఖ్య 82.2 కోట్లుగా నమోదైంది. సగటు రోజువారీ లావాదేవీల విలువ తొలిసారిగా రూ.లక్ష కోట్లను దాటింది. గత ఏడాది అక్టోబరుతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 23 శాతం, విలువ 16 శాతం పెరిగాయి. 2025 అక్టోబరు లో 2,070 కోట్ల లావాదేవీల ద్వారా రూ.27.27 లక్షల కోట్ల చెల్లింపులు జరిగా యి. నవరాత్రులు, దీపావళి కొనుగోళ్లు, ఈ–కామర్స్ ఆఫర్లు ఈసారి లావాదే వీల పెరుగుదలకు దోహదపడ్డాయి. సెప్టెంబరులో 2,406 కోట్ల లావాదేవీలు, రూ.29.37 లక్షల కోట్ల విలువైన చెల్లింపులు జరగ్గా.. ఆగస్టులో 2,450 కోట్ల లావాదేవీల విలువ రూ.29.82 లక్షల కోట్లుగా నమోదైంది. మరోవైపు, కొందరు వ్యాపారులకు వ్యక్తుల నుంచి జరిగే చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న ప్రతిపాదన దీపావళి తర్వాత అమల్లోకి వస్తుందా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

ఇక ఆకాశమే హద్దుగా!


సుదూర గగన విహారానికి ఇండిగో రెడీ

- 2028 నుంచి ఏ350 వైడ్‌బాడీ విమానాల సేవలు
- బిజినెస్, ప్రీమియం ఎకానమీ క్లాస్‌లతో కొత్త ప్రయాణ అనుభూతి
- సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ విస్తరణకు వ్యూహం
- ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తాం: ఇండిగో సీఈఓ విల్లీ వాల్ష్

న్యూఢిల్లీ: విమానయాన రంగంలో సవాళ్లు ఉన్నప్పటికీ తమ సంస్థకు విస్తృత అవకాశాలున్నాయని ఇండిగో సీఈఓ విల్లీ వాల్ష్ తెలిపారు. వ్యయ నియంత్రణతో ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2028 రెండో త్రైమాసికం నుంచి ఏ350 వైడ్‌బాడీ విమానాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సుదూర అంతర్జాతీయ సర్వీసుల విస్తరణలో భాగంగా ఏ350 విమానాల్లో బిజినెస్, ప్రీమియం ఎకానమీ, ఎకానమీ తరగతులను ఏర్పాటు చేయనున్నారు. తొలి 10 విమానాల్లో బిజినెస్ క్లాస్‌కు 16 ఫ్లాట్ బెడ్లు ఉంటాయని వాల్ష్ తెలిపారు. మరోవైపు ఇంధన ధరల పెరుగుదల, రూపాయి విలువ క్షీణతతో సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఇండిగో రూ.1,879.1 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఇంధన ధరల హెడ్జింగ్‌పై ప్రస్తుతానికి నిర్ణయం లేదని, వ్యయాలను అదుపు చేస్తూ పరిస్థితులను ఎదుర్కొంటామని వాల్ష్ పేర్కొన్నారు. నవీ ముంబై విమానాశ్రయం అంతర్జాతీయ సర్వీసుల విస్తరణకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఇండిగో రోజుకు 2,100కు పైగా విమాన సర్వీసులను నిర్వహిస్తోంది. సంస్థ వద్ద 400కు పైగా విమానాలున్నాయి.

ఇంధన ధరలపై రిక్స్ తీసుకోం

విమాన ఇంధన ధరల పెరుగుదల నుంచి రక్షణ పొందేందుకు ముందస్తు ధరల ఒప్పందాల (హెడ్జింగ్) అమలుపై ప్రస్తుతం ఎలాంటి ప్రణాళికలు లేవని ఇండిగో సీఈఓ విల్లీ వాల్ష్ స్పష్టం చేశారు. సుదూర అంతర్జాతీయ విమాన సర్వీసుల విస్తరణ సమయంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. భారత దేశీయ విమానయాన సంస్థలేవీ ప్రస్తుతం హెడ్జింగ్ విధానాన్ని అనుసరించడం లేదని, ఇండిగో ఒక్కటే ఈ విధానాన్ని చేపడితే పోటీలో అదనపు రిస్క్ ఎదురవుతుందని వాల్ష్ పేర్కొన్నారు. ఈ అంశంపై ఇటీవల బోర్డు సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. 2028 రెండో త్రైమాసికం నుంచి ఏ350 వైడ్‌బాడీ విమానాలను ప్రవేశపెట్టాలని ఇండిగో యోచిస్తోంది. కాగా, నిర్వహణ వ్యయాల్లో ఇంధన ఖర్చుల వాటా దాదాపు 40 శాతంగా ఉంది. రూపాయి పతనం, ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో 2026 సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఇండిగో రూ.1,879.1 కోట్ల నష్టాన్ని ప్రకటించింది.





రిలయన్స్ జోరు.. దూసుకెళ్లిన సెన్సెక్స్

- ఏడు వారాల గరిష్ఠానికి సూచీలు.. 23,400 దాటిన నిఫ్టీ
- జీఎస్టీ వసూళ్లు, వాహన విక్రయాల్లోనూ వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో భారీ కొనుగోళ్లు, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం, మెరుగైన కంపెనీల త్రైమాసిక ఫలితాలు సూచీలకు ఊతమిచ్చాయి. దీంతో సోమవారం సెన్సెక్స్ 1,233.25 పాయింట్లు (1.66 శాతం) పెరిగి 75,692.78 వద్ద ముగిసింది. సెప్టెంబరు 7 తర్వాత ఇదే అత్యధిక ముగింపు స్థాయి. నిఫ్టీ 387.70 పాయింట్లు (1.68 శాతం) లాభపడి 23,440.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 11.64 శాతం ఎగిసి ర్యాలీకి ప్రధాన కారణమైంది. జులై–సెప్టెంబరు త్రైమాసికంలో సంస్థ రూ.29,550 కోట్ల రికార్డు నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 33.8 శాతం అధికం. టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, మారుతీ సుజుకీ షేర్లు లాభపడగా.. ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్ ఫార్మా నష్టపోయాయి.

తగ్గిన ముడిచమురు ధరలు

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 4.46 శాతం తగ్గి బ్యారెల్ 108.7 డాలర్లకు చేరింది. దీంతో ఇంధన వ్యయాలపై ఆందోళనలు తగ్గాయి. శుక్రవారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.3,598.54 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. మరోవైపు అక్టోబరులో జీఎస్టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 23 శాతం పెరిగి రూ.2.31 లక్షల కోట్లకు పైగా నమోదయ్యాయి. పండుగల కొనుగోళ్లతో ప్యాసింజర్ వాహనాల విక్రయాలు కూడా రికార్డు స్థాయిలో ఐదు లక్షల యూనిట్లను దాటాయి. మెరుగైన త్రైమాసిక ఫలితాలు, దేశీయ ఆర్థిక పరిస్థితులు, తగ్గిన చమురు ధరలు మార్కెట్‌కు మద్దతిచ్చాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ తెలిపారు. అమెరికా–ఇరాన్ దౌత్య ప్రయత్నాలు, విదేశీ మదుపర్ల కొనుగోళ్లు కూడా సానుకూల ప్రభావం చూపాయని పేర్కొన్నారు.



గ్రోక్ నిర్వహణకు భారీ వ్యయం

- ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్



న్యూఢిల్లీ: ఉత్పాదకతను పెంచుకునేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్న కంపెనీలకు ఇప్పుడు ఖర్చుల భారం ఆందోళన కలిగిస్తోంది. ఏఐ సేవల నిర్వహణకు భారీగా వ్యయమవుతుండటంతో ఖర్చులను తగ్గించుకునే మార్గాలపై సంస్థలు దృష్టి సారిస్తున్నాయి. తాజాగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం ఇదే అంశంపై స్పందించారు. ఎక్స్ సామాజిక మాధ్యమంలో గ్రోక్ ఏఐ చాట్‌బాట్ నిర్వహణకు భారీ మొత్తంలో ఖర్చవుతోందని, దాని ద్వారా వచ్చే ఆదాయం కంటే వ్యయాలే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. ఇటీవల ఎక్స్ ప్రీమియం వినియోగ దారులు గ్రోక్ వారపు వినియోగ పరిమితులు త్వరగా పూర్తవుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓ మాజీ వినియోగదారుడు గ్రోక్ వినియోగ పరిమితులను పునరుద్ధరించాలని కోరుతూ మస్క్‌ను ట్యాగ్ చేశారు. దీనికి స్పందించిన ఆయన.. సర్వర్ నిర్వహణ ఖర్చులు మరింత పెరగకుండా ఉండేందుకు కఠినమైన వినియోగ పరిమితులు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఏఐ కోసం పెరుగుతున్న అప్పులు

మరోవైపు ఏఐ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కోసం అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థలు చేస్తున్న అప్పులు భారీగా పెరుగుతున్నాయి. 2026 మధ్య నాటికి ఈ సంస్థల మొత్తం రుణభారం సుమారు 45 శాతం పెరిగి 578 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.54 లక్షల కోట్లు) చేరినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2025లో ఈ మొత్తం 399 బిలియన్ డాలర్లుగా ఉంది. ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, టెస్లా వంటి దిగ్గజ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఏఐపై పెట్టుబడులు పెరుగుతున్న కొద్దీ వాటి నిర్వహణ, మౌలిక సదుపాయాల వ్యయాలు కూడా కంపెనీలకు భారంగా మారుతున్నాయి.



రూ.800 కోట్ల క్లబ్‌లోకి 'జైలర్ 2'..

కోలీవుడ్‌లో రజనీకాంత్ సరికొత్త రికార్డ్!

- ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లు దాటిన 'జైలర్ 2' వసూళ్లు
- ఈ ఘనత సాధించిన తొలి తమిళ చిత్రంగా సరికొత్త రికార్డ్
- 18 రోజుల్లోనే ఈ అరుదైన మైలురాయిని అందుకున్న సినిమా
- రజనీకాంత్ పాత రికార్డులను సైతం అధిగమించిన వసూళ్లు
- భారత్‌లో రూ. 456 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన 18 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్ల వసూళ్ల మార్క్‌ను దాటిన తొలి తమిళ చిత్రంగా ఈ సినిమా రికార్డు నెలకొల్పింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో అక్టోబర్ 15న విడుదలైన ఈ యాక్షన్ కామెడీ సీక్వెల్, వసూళ్లలో తన జోరును కొనసాగిస్తోంది. ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'సాక్‌నిల్క్' వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 18వ రోజు నాటికి ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 808 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇందులో దేశీయంగా రూ. 456 కోట్ల నెట్ (సుమారు రూ. 534 కోట్ల గ్రాస్) రాబట్టగా, విదేశాల్లో రూ. 273-274 కోట్ల వరకు వసూళ్లు సాధించింది. 18వ రోజైన ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 11.2 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం. ఈ భారీ వసూళ్లతో 'జైలర్ 2' తమిళ చిత్ర పరిశ్రమలో మునుపటి రికార్డులన్నింటినీ బద్దలు కొట్టింది. రజనీకాంత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన '2.0' చిత్రం లైఫ్‌టైమ్ కలెక్షన్లను కూడా ఇది అధిగమించింది. అంతేకాకుండా 'పీకే', 'ఛావా' వంటి చిత్రాల మొత్తం వసూళ్లను కూడా దాటి 2026లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ వారం చివర్లో 'రామాయణ' వంటి భారీ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో 'జైలర్ 2' వసూళ్ల వేగం కొంత తగ్గే అవకాశం ఉంది.



48 ప్రభుత్వ స్కూళ్లను దత్తత తీసుకున్న మంచు లక్ష్మి

గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యమని వెల్లడి
సంగారెడ్డి జిల్లా చౌటకూర్ స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్ ప్రారంభం

ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త మంచు లక్ష్మి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నడుం బిగించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్టు ఆమె తెలిపారు. తన 'టీచ్ ఫర్ చేంజ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈరోజు సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన మంచు లక్ష్మి... చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ 'టీచ్ ఫర్ చేంజ్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన లక్ష్మి... గ్రామీణ విద్యార్థుల కోసం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. దత్తత తీసుకున్న పాఠశాలల్లో స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. నాణ్యమైన విద్య ద్వారానే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

ప్రేమలో దారుణంగా మోసపోయా

రెజీనా కసాండ్రా



- ప్రేమలో మోసపోయి డిప్రెషన్‌కు గురయ్యానన్న రెజీనా
- 2020లో తన జీవితంలో ఈ చేదు అనుభవం ఎదురైందని వెల్లడి
- ఇతరుల ప్రేమ కన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం ముఖ్యమన్న నటి

విభిన్నమైన పాత్రలతో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రెజీనా కసాండ్రా... తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి సంచలన విషయాలు వెల్లడించారు. గతంలో తాను ప్రేమలో దారుణంగా మోసపోయానని, ఆ కారణంగా తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని ఆమె తెలిపారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'మూకుత్తి అమ్మన్ 2' (తెలుగులో 'మహాశక్తి') చిత్ర ప్రచార కార్యక్రమాల్లో ఈ వ్యాఖ్యలు చేశారు. తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ... "2020లో నా జీవితంలో ఊహించని ఘటన జరిగింది. నేను ప్రేమించిన వ్యక్తి నన్ను మోసం చేయడంతో ఆ బంధం ముగిసిపోయింది. ఆ పరిణామం నన్ను మానసికంగా కుంగదీసింది. చాలా కాలం డిప్రెషన్‌తో బాధపడ్డాను. ఆ బాధ నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది" అని రెజీనా భావోద్వేగానికి గురయ్యారు. ఈ కష్టకాలం నుంచి బయటపడటానికి తనకు తానే సమయం కేటాయించుకోవడం ఎంతో సహాయపడిందని ఆమె అన్నారు. "ఇతరుల నుంచి ప్రేమను ఆశించే ముందు, మనల్ని మనం ప్రేమించుకోవడం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు. యువతులు లైంగిక వేధింపులు వంటి చేదు అనుభవాలు ఎదుర్కొన్నప్పుడు తమను తాము నిందించుకోవద్దని సూచించారు. బాధను మనసులో దాచుకోకుండా, నమ్మకమైన వారితో పంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె సలహా ఇచ్చారు.



'ఓ మైసా రే'.. రష్మిక 'మైసా' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల

నేషనల్ క్రష్' రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'మైసా' నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ విడుదల చేశారు. ఈ సినిమా నుంచి 'ఓ మైసా రే' పేరుతో తొలి పాట లిరికల్ వీడియోను సోమవారం ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మహిళా శక్తిని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా ఈ పాట సాగుతూ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ గీతానికి, సుప్రసిద్ధ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ శక్తివంతమైన సాహిత్యాన్ని అందించారు. గాయని సింధుజ శ్రీనివాసన్ తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. కథానాయిక పాత్రలోని ధైర్యం, తెగువ, పోరాట స్ఫూర్తిని ఈ పాట ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా, ఈ లిరికల్ వీడియోలో రష్మిక మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా ఆమె లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. బృందా మాస్టర్ కొరియోగ్రఫీ పాటకు అదనపు ఆకర్షణగా నిలిచింది. రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రొటీన్ పాత్రలకు భిన్నంగా రష్మిక చేస్తున్న ఈ ప్రయోగంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. 'మైసా' చిత్రాన్ని నవంబర్ 27న తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.